'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 42 | శనివారం | 26.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 42 | Saturday | 26.9.2026 | Pages: 8 | Rate: 2



2లో..

## భక్తిసాగరంలో...
## గణేషుడి మహాయాత్ర

• 69 అడుగుల ఖైరతాబాద్ వినాయకుడికి ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్ నగరం శుక్రవారం భక్తిసాగరంగా మారింది. 69 అడుగుల ఖైరతాబాద్ గణేశ్ విగ్రహం శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగి మధ్యాహ్నం 2.25 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం పూర్తైంది. ఈ ఏడాది 'విశ్వశాంతి మహాశక్తి వినాయక'గా కొలువైన విగ్రహాన్ని చూసేందుకు వేలాది మంది భక్తులు ఖైరతాబాద్‌కు తరలివచ్చారు. భారీ మల్టీ యాక్సిల్ ట్రైలర్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేసి నెమ్మదిగా ప్రధాన మార్గాల్లో తరలించారు. దారిపొడవునా భక్తులు పూలు చల్లుతూ, ప్రార్థనలు చేస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. సుమారు 150 మంది కళాకారులు ఈ భారీ విగ్రహ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. తెల్లవారుజామున ప్రారంభం కావాల్సిన ప్రయాణం విగ్రహాన్ని ట్రాలీకి వెల్డింగ్ చేసే ప్రక్రియ ఆలస్యం కావడంతో రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.

## బాలాపూర్ లడ్డూ వేలం రికార్డ్



రూ.39 లక్షల బిడ్..

### ఎవరీ ప్రణీత్‌రెడ్డి?

అమెరికా నుంచి వచ్చి.. భారీ వేలం

**రూ.39 లక్షలతో కొత్త చరిత్ర**

హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే బాలాపూర్ గణేశ్ లడ్డూ ఈసారి రికార్డు ధర పలికింది. 21 కిలోల లడ్డూ శుక్రవారం జరిగిన వేలంలో రూ.39 లక్షలకు అమ్ముడైంది. అర్బన్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సామ ప్రణీత్‌రెడ్డి రూ.39 లక్షల బిడ్‌తో లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది రూ.35 లక్షలకు విక్రయమైన లడ్డూతో పోలిస్తే ఈసారి రూ.4 లక్షలు అదనంగా వచ్చింది. వేలంలో మొత్తం తొమ్మిది మంది పాల్గొన్నారు. బిడ్డింగ్ ప్రారంభానికి ముందు బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఈ ఏడాది లోటుగా ఉన్న వర్షాల నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని గణనాథుడిని ప్రార్థించారు. (వివరాలు 2లో..)

## గణేశ్ శోభాయాత్రలో దానం జోష్

**'ఆయా షేర్' పాటకు స్టెప్పులు**

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్రలో ఎమ్మెల్యే దానం నాగేందర్ డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. శుక్రవారం శోభాయాత్ర సందర్భంగా 'ఆయా షేర్' పాటకు దానం నాగేందర్ ఉత్సాహంగా స్టెప్పులేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న మహిళా పోలీసు సిబ్బందిని ఉత్సాహపరుస్తూ ఆయన వారితో కలిసి సరదాగా నృత్యం చేశారు. భారీగా తరలివచ్చిన భక్తుల మధ్య ఈ సన్నివేశం చోటుచేసుకుంది. దానం వేసిన స్టెప్పులకు అక్కడున్న వారు కేరింతలు కొట్టారు. ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్రలో భక్తుల సందడి, మేళతాళాల మధ్య ఈ ఘటన చోటుచేసుకోవడంతో చూపరుల దృష్టిని ఆకర్షించింది. ఈ దృశ్యాలను పలువురు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు. (వివరాలు 2లో..)



# తప్పుల తడకగా ఫామ్ సిక్స్
# తప్పించుకోలేక సీఈసీ ఫిక్స్




7లో.

• చిన్న మార్పు.. పెద్ద వివాదం

• తెర వెనుక కథ నడిపించిందెవరు? • ఓటు హక్కుపై కొత్త ప్రశ్నలు

ఒక్క ప్రశ్న.. ఓటు హక్కుపై ఇంత పెద్ద రగడ ఎందుకు? కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫామ్ 6 లో జూలై 2026లో చేసిన చిన్న మార్పు ఇప్పుడు ఎన్నికల వ్యవస్థలో పెను చర్చకు దారితీసింది. సర్‌కు సంబంధించిన కుటుంబ వివరాల ప్రశ్నను ఫార్మ్‌లో చేర్చడంపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. చట్టబద్ధ నిబంధనలు మార్చకుండా ఫామ్ 6 ను మార్చవచ్చా? ఇద్దరు కమిషనర్లు అభ్యంతరం చెప్పినా మార్పు ఎందుకు అమల్లోకి వచ్చింది? సర్‌లో కోట్లాది పేర్లు తొలగించిన తర్వాత, కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే యువతపై ఈ ప్రశ్న ప్రభావం ఏమిటి? ఇక్కడే కథ మరింత ఆసక్తికరంగా మారుతోంది. ఓటర్ల డేటాబేస్ నియంత్రణపై కూడా కమిషనర్ల నుంచి ప్రశ్నలు రావడం, గత పది నెలల్లో పలు నిర్ణయాలపై లిఖితపూర్వక అభ్యంతరాలు నమోదు కావడం అనుమానాలకు మరింత ఆజ్యం పోశాయి. ఇది నిజంగా రాజకీయ ప్రభావానికి సంబంధించిన వ్యవహారమా? లేక ఎన్నికల ప్రక్రియలోని చట్టపరమైన, సాంకేతిక లోపాలా? ఆరోపణలు ఒకవైపు.. ఎన్నికల సంఘం వివరణ మరోవైపు.. అసలు ఫైళ్లలో ఏముంది? ఫామ్ 6 మార్పు వెనుక నిర్ణయాల పరంపర ఎలా సాగింది? ఓటర్ల జాబితా నుంచి ఎన్నికల ఫలితాల వరకు దాని ప్రభావం ఏమిటి? ఆ మిస్టరీని ఛేదించే అసలు కథ ఇది..!

## సీఈసీ విచారణపై దూకుడు

• సుప్రీం కోర్టు ముందుకు పిటిషన్
• సాధారణ నిందితుడిలా విచారించాలి
• రాజ్యాంగ రక్షణ వర్తించదంటూ లాయర్



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పోలీసు దర్యాప్తు, ఆధారాల సేకరణ, సాధారణ న్యాయ విచారణ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి ఈ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది చాంద్ ఖురేషీ ద్వారా దాఖలైన పిటిషన్‌లో, ఎన్నికల ఓటర్ల జాబితా విషయంలో వచ్చిన ఆరోపణలకు అధికారిక విధులతో నేరుగా సంబంధం లేదని వాదించారు. (3లో..)

## జ్ఞానేశ్‌కు రక్షణ లేదా?

▪ అరెస్ట్‌కు ఛాన్స్ ఉందా?
▪ పిటిషన్‌తో కొత్త మలుపు



### సీఈసీ తొలగింపు కోసం కాంగ్రెస్ నిరసన

బారికేడ్లు దాటేందుకు గోగోయ్ యత్నం

ఈసీని తొలగించాలంటూ ఆందోళన



### జ్ఞానేశ్ రాజీనామాతో ఆగదు

అక్రమార్కులందరిపై చర్యలు!

ఎస్పీ ఎంపీ డింపుల్ యాదవ్



### ఈసీపై ప్రశ్నలు

మిత్రుల నుంచే సూచనలు!

ప్రజల సందేహాలు తీర్చాలన్న చిరాగ్

వివరాలు3లో..



## ఈసీపై పోరు.. దేశవ్యాప్తంగా నిరసనలు

• జ్ఞానేశ్ రాజీనామాకు కాంగ్రెస్ పిలుపు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఢిల్లీ, పట్నా, కోల్‌కతా, జమ్మూ, అసోం, ఒడిశా, మేఘాలయ, హిమాచల్‌ప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీలు నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై స్వతంత్ర సమీక్ష చేపట్టాలని, సీఈసీపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద భారీగా పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. అసోంలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్నాలో నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కేనన్లు ఉపయోగించారు.



### ఎన్నికలు రిగ్గయ్యాయా..
### అలాంటప్పుడు పోటీ ఎందుకు?

**దూరంగా ఉండాలని దిప్కే హితవు**

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ప్రతిపక్ష పార్టీలకు కీలక ప్రశ్న సంధించారు. ఎన్నికల ప్రక్రియ రిగ్గవుతోందని ఆరోపిస్తున్నప్పుడు అదే ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు నిజంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా లేవని భావిస్తే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. (వివరాలు 3లో..)

### మహిళ మార్ఫింగ్ ఫొటోలపై
### హైకోర్టు సీరియస్

24 గంటల్లో తొలగించాలని మెటాకు ఆదేశాలు

సీజేపీ నేతలకు కోర్టు నోటీసులు జారీ

## పాకిస్తాన్‌కు నిద్రలేని రాత్రులు



**బ్రహ్మోస్‌తో పాక్‌కు షాక్! అమిత్ షా**

ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేకుండా చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. గ్రేటర్ నోయిడాలో జరిగిన యూపీ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. (2లో..)



### అధికారం ఉందని గర్వం వద్దు

పంచాయతీ పోరుకు సిద్ధం కండి!

బీజేపీ నేతలకు నితిన్ నబిన్ హెచ్చరిక

(వివరాలు 2లో..)



### లద్దాఖ్ హింసపై వాంగ్‌చుక్ పోరు

షా రాజీనామాకు డిమాండ్

ఎన్‌కౌంటర్ తో ప్రాణ భయం ఉందని వ్యాఖ్యలు

(వివరాలు 2లో..)



2లో..

### నెక్స్ట్ ఎవరు?

దానం తీర్పుతో ఉత్కంఠ

**కడియం ఫిరాయింపుపై ఫోకస్**

ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. దీంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన కడియం శ్రీహరి 2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదే అంశంపై ఆయనపై అనర్హత పిటిషన్ దాఖలైంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ అనంతరం పిటిషన్‌ను కొట్టివేశారు.

### గోదావరి ఉరకలు... రిజర్వాయర్లు వెలవెల

నీటిని ఎత్తిపోయండి.. నిల్వలు పెంచండి

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ**

గోదావరిలో భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్నా రిజర్వాయర్లను నింపేందుకు మోటార్లు నడపకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. (వివరాలు 2లో..)





2లో..

### రూ.2.1 కోట్ల లావాదేవీలు

సెప్టెంబర్ 28న విచారణ

**అరెకపూడి గాంధీకి ఈడీ నోటీసులు**

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కేసులో ఆయన బ్యాంకు ఖాతాల ద్వారా సుమారు రూ.2.1 కోట్ల నిధులు వెళ్లినట్లు దర్యాప్తులో గుర్తించిన నేపథ్యంలో ఈ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. సెప్టెంబర్ 24న జారీ చేసిన సమన్లలో సెప్టెంబర్ 28న విచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ నుంచి వచ్చిన నిధుల స్వభావం, వాటి ఉద్దేశ్యం, లావాదేవీల నేపథ్యంపై గాంధీని అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది.

# బాలాపూర్ లడ్డూ వేలం రికార్డ్

హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే బాలాపూర్ గణేశ్ లడ్డూ ఈసారి రికార్డు ధర పలికింది. 21 కిలోల లడ్డూ శుక్రవారం జరిగిన వేలంలో రూ.39 లక్షలకు అమ్ముడైంది. అర్బన్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సామ ప్రణీత్‌రెడ్డి రూ.39 లక్షల బిడ్‌తో లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది రూ.35 లక్షలకు విక్రయమైన లడ్డూతో పోలిస్తే ఈసారి రూ.4 లక్షలు అదనంగా వచ్చింది. వేలంలో మొత్తం తొమ్మిది మంది పాల్గొన్నారు. బిడ్డింగ్ ప్రారంభానికి ముందు బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఈ ఏడాది లోటుగా ఉన్న వర్షాల నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని గణనాథుడిని ప్రార్థించారు.



### 18 అడుగుల విగ్రహానికి ఘన ఊరేగింపు

వేలానికి ముందు 18 అడుగుల బాలాపూర్ గణేశ్ విగ్రహాన్ని స్థానిక వీధుల్లో ఊరేగించారు. విగ్రహ దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు రహదారుల వెంట నిలబడ్డారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. వేలం, శోభాయాత్ర సుమారు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. వేలం ముగిసిన తరువాత బాలాపూర్ గణేశ్ శోభాయాత్ర 18 కిలోమీటర్ల ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ యాత్ర హుస్సేన్‌సాగర్ వైపు సాగింది. అక్కడ విగ్రహ నిమజ్జనం నిర్వహించనున్నారు.

### రూ.450 నుంచి రూ.39 లక్షలకు

బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలం చరిత్ర 1994లో ప్రారంభమైంది. అప్పట్లో ఇదే తరహా లడ్డూను కేవలం రూ.450కు రైతు కోలన్ మోహన్‌రెడ్డి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ప్రతి ఏడాది వేలం విలువ పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు రూ.39 లక్షలకు చేరుకోవడంతో బాలాపూర్ లడ్డూ వేలం గణేశ్ ఉత్సవాల్లో ప్రత్యేక సంప్రదాయంగా మారింది. భక్తుల్లో భారీ ఆసక్తి రేపుతున్న ఈ వేలం ప్రతి ఏడాది కొత్త రికార్డులకు వేదికగా నిలుస్తోంది. లడ్డూ కేవలం ప్రసాదంగా కాకుండా బాలాపూర్ గణేశ్ వేడుకలకు ప్రతీకగా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.

# భక్తిసాగరంలో ఖైరతాబాద్ గణేశ్ మహాయాత్ర

### 69 అడుగుల వినాయకుడికి ఘన వీడ్కోలు భారీ బందోబస్తు.. కట్టుదిట్టమైన నిఘా

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేసింది. దాదాపు 20 వేల మంది పోలీసులను బందోబస్తుకు మోహరించగా, ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో 10 వేల సీసీ కెమెరాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించారు. డ్రోన్లతోనూ పరిస్థితిని పర్యవేక్షించారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీవీఎన్ఆర్ మార్గ్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు ప్రధాన శోభాయాత్ర మార్గాల్లో గణేశ్ విగ్రహాలను తరలించే వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. పరిస్థితిని బట్టి కొన్ని మార్గాల్లో ఆంక్షలు శనివారం సాయంత్రం వరకు కొనసాగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### వేగంగా నిమజ్జనానికి అధికారుల సూచనలు

భారీగా తరలివచ్చిన విగ్రహాలతో నిమజ్జన ప్రక్రియకు సమయం పడుతోంది. 110 స్టాటిక్ క్రేన్లు, 170 మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వాహకులు, భక్తులు సహకరించి విగ్రహాలను వేగంగా తరలించాలని కోరారు. నగరంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున శనివారం ఉదయానికే నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు హైదరాబాద్ మెట్రో, ఎంఎంటీఎస్ ప్రత్యేక సేవలను నడిపాయి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రవాణా ఇబ్బందులు తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టారు. 47 చెరువులు, బేబీ పాండ్లు, ఇతర జలాశయాలను కూడా నిమజ్జనానికి అందుబాటులో ఉంచారు.



# ఎవరీ ప్రణీత్‌రెడ్డి?

## అమెరికా నుంచి వచ్చి.. భారీ బిడ్

బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంలో రూ.39 లక్షల భారీ బిడ్ వేసి ప్రసాదాన్ని దక్కించుకున్న సామ ప్రణీత్‌రెడ్డి ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. 35 ఏళ్ల ప్రణీత్‌రెడ్డి హైదరాబాద్‌లోని వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త. అర్బన్ రియాలిటీ గ్రూప్‌తో అనుబంధంగా ఉన్న ఆయన ఇటీవలే అమెరికా నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. అనంతరం అర్బన్ గ్రూప్ పేరుతో వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించారు. బాలాపూర్ గణేశ్ ఉత్సవాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే లడ్డూ వేలంలో పాల్గొన్న ఆయన, ఇతర బిడ్డర్లను వెనక్కి నెట్టి అత్యధిక ధరతో ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు.

### రూ.450 నుంచి రూ.39 లక్షలకు

బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలం సంప్రదాయం 1994లో కేవలం రూ.450తో ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతి ఏడాది వేలం నిర్వహిస్తూ వస్తున్నారు. భక్తులు వేలంలో లడ్డూను దక్కించుకోవడం ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నారు. కాలక్రమంలో లడ్డూ ధర భారీగా పెరిగింది. 2025లో రూ.35 లక్షలకు లడ్డూ వేలం జరిగింది. ఈ ఏడాది ప్రణీత్‌రెడ్డి వేసిన రూ.39 లక్షల బిడ్ గతేడాది ధర కంటే రూ.4 లక్షలు ఎక్కువ. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో మరో కొత్త రికార్డు నమోదైంది. ప్రసాదాన్ని దక్కించుకున్న ప్రణీత్‌రెడ్డి పేరు ఈ ఏడాది గణేశ్ ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిలిచింది.



# గణేశ్ శోభాయాత్రలో దానం జోష్

## ‘ఆయా షేర్’ పాటకు స్టెప్పులు

దానం వేసిన స్టెప్పులకు అక్కడున్న వారు కేరింతలు కొట్టారు. ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్రలో భక్తుల సందడి, మేళతాళాల మధ్య ఈ ఘటన చోటుచేసుకోవడంతో చూపరుల దృష్టిని ఆకర్షించింది. ఈ దృశ్యాలను పలువురు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించారు.

### సోషల్ మీడియాలో వైరల్‌గా వీడియో

దానం నాగేందర్ డ్యాన్స్‌కు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహిళా పోలీసులతో కలిసి ఆయన చేసిన నృత్యం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొనగా, భారీ బందోబస్తు మధ్య ఊరేగింపు కొనసాగింది. ఈ ఏడాది 69 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతిని హుస్సేన్‌సాగర్ వైపు తరలించారు. నిమజ్జన మార్గంలో భక్తుల రద్దీతో పండుగ వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో దానం నాగేందర్ పాటకు అనుగుణంగా వేసిన స్టెప్పులు వేడుకల్లో మరో ప్రత్యేక దృశ్యంగా నిలిచాయి.



# రూ.2.1 కోట్ల లావాదేవీలు

- సెప్టెంబర్ 28న విచారణ
- అరెకపూడి గాంధీకి ఈడీ నోటీసులు



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కేసులో ఆయన బ్యాంకు ఖాతాల ద్వారా సుమారు రూ.2.1 కోట్ల నిధులు వెళ్లినట్లు దర్యాప్తులో గుర్తించిన నేపథ్యంలో ఈ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. సెప్టెంబర్ 24న జారీ చేసిన సమన్లలో సెప్టెంబర్ 28న విచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ నుంచి వచ్చిన నిధుల స్వభావం, వాటి ఉద్దేశ్యం, లావాదేవీల నేపథ్యంపై గాంధీని అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది.

### రూ.842 కోట్ల నేరపూరిత ఆదాయం ఆరోపణ

సాహితీ ఇన్‌ఫ్రాటెక్ కేసులో ఇళ్ల కొనుగోలుదారుల నుంచి ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసి, హామీ ఇచ్చిన ఫ్లాట్లు ఇవ్వలేదని, నగదు తిరిగి చెల్లించలేదని ఈడీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంలో రూ.842.15 కోట్ల మేర నేరపూరిత ఆదాయం ఉత్పన్నమైనట్లు ఈడీ అంచనా వేసింది. ఇందులో రూ.216.91 కోట్లను కొనుగోలుదారుల నుంచి నగదు రూపంలో తీసుకుని సంస్థ లెక్కల్లో చూపలేదని దర్యాప్తు సంస్థ పేర్కొంది. సంబంధిత సంస్థలు, వ్యక్తుల ఖాతాలకు నిధులను మళ్లించడం, నగదు ఉపసంహరణలు, విదేశీ ఖాతాలకు డబ్బు తరలింపుపై కూడా ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

### రూ.2.1 కోట్ల నగదు మార్గంపైనే దృష్టి

అరెకపూడి గాంధీ విచారణలో ప్రధానంగా సాహితీ ఇన్‌ఫ్రాటెక్ నుంచి ఆయన ఖాతాలకు చేరినట్లు పేర్కొంటున్న రూ.2.1 కోట్ల నిధుల మార్గం చుట్టూనే ప్రశ్నలు ఉండనున్నాయి. ఆ డబ్బు ఎప్పుడు వచ్చింది, ఏ ప్రయోజనం కోసం బదిలీ అయింది, సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలతో ఆయనకు ఉన్న ఆర్థిక సంబంధాలపై ఈడీ వివరాలు కోరనున్నట్లు తెలుస్తోంది. సాహితీ ఇన్‌ఫ్రాటెక్, దాని మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ్ తదితరులపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ దర్యాప్తు చేపట్టింది. అయితే గాంధీపై ఈ దశలో వచ్చినవి దర్యాప్తులోని ఆరోపణలు మాత్రమే; విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉంది.

# గోదావరి ఉరకలు... రిజర్వాయర్లు వెలవెల

- నీటిని ఎత్తిపోయండి.. నిల్వలు పెంచండి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ ఇ-

గోదావరిలో భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్నా రిజర్వాయర్లను నింపేందుకు మోటార్లు నడపకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. ఎల్లంపల్లి వద్ద భారీగా నీరు ఉన్నప్పటికీ మోటార్లు ఆన్ చేసి ఎత్తిపోకపోవడం వల్ల సాగునీటి నిల్వలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. అన్నపూర్ణ, రంగనాయక సాగర్ రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయని, 50 టీఎంసీల సామర్థ్యం ఉన్న మల్లన్న సాగర్‌లో కేవలం 13 టీఎంసీలు, ఎల్ఎండీలో 11 టీఎంసీల నీరే ఉందని హరీశ్‌రావు తెలిపారు.

### రిజర్వాయర్లు ఖాళీ.. రైతుల్లో ఆందోళన

రంగనాయక సాగర్‌లో నీటి కొరత కారణంగా సిద్దిపేట నర్మెట్టలోని పామాయిల్ ఫ్యాక్టరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. నీటి నిల్వలు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గోదావరిలో వరద నీరు అందుబాటులో ఉన్న సమయంలోనే దాన్ని రిజర్వాయర్లకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌నినో వంటి కారణాలను చూపకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### 24 గంటలు మోటార్లు నడపాలని డిమాండ్

ఇక ఆలస్యం చేయకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లను నడిపించి మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ సహా అన్ని రిజర్వాయర్లను నింపాలని హరీశ్‌రావు కోరారు. ప్రాజెక్టులపై రాజకీయాలు పక్కనపెట్టి రైతుల సాగునీటి అవసరాలు, ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వరద నీటిని సమర్థంగా వినియోగించకపోతే భవిష్యత్‌లో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# నెక్స్ట్ ఎవరు?

- దానం తీర్పుతో ఉత్కంఠ
- కడియం ఫిరాయింపుపై ఫోకస్



ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. దీంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన కడియం శ్రీహరి 2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదే అంశంపై ఆయనపై అనర్హత పిటిషన్ దాఖలైంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ అనంతరం పిటిషన్‌ను కొట్టివేశారు.

### సుప్రీం నిర్ణయంతో షాక్

స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దానం నాగేందర్ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టి అనర్హత వేటు వేసింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయాల న్యాయపరమైన పరిశీలనకు ప్రాధాన్యం పెరిగింది. ఇదే నేపథ్యంలో కడియం శ్రీహరి కేసులో తదుపరి పరిణామాలపై ఉమ్మడి వరంగల్ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

### కడియంపై బీఆర్ఎస్ ఆరోపణలు

కడియం శ్రీహరి 2023లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ నేతలు ఆయనపై అనర్హత పిటిషన్ వేశారు. పార్టీ మారడం, కుమార్తె కడియం కావ్య తరఫున కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రచారం చేయడం, బీఆర్ఎస్ నాయకత్వంపై విమర్శలు చేయడం వంటి అంశాలను ఫిర్యాదులో ప్రస్తావించారు. కడియం కావ్య 2024లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో కడియం పిటిషన్ విషయంలో తదుపరి న్యాయపరమైన అడుగులు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# పాకిస్తాన్‌కు నిద్రలేని రాత్రులు

### బ్రహ్మోస్‌తో పాక్‌కు షాక్! అమిత్ షా

### రూ.1.78 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తి

ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేకుండా చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. గ్రేటర్ నోయిడాలో జరిగిన యూపీ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2017 తర్వాత ఉత్తరప్రదేశ్‌లో రక్షణ తయారీ రంగం వేగంగా విస్తరిస్తోందని చెప్పారు. లక్నోలో బ్రహ్మోస్ తయారీ కేంద్రం, అమేథీలో ఏకే203 రైఫిళ్ల ఉత్పత్తిని దీనికి ఉదాహరణలుగా పేర్కొన్నారు.
దేశ రక్షణ ఉత్పత్తి సుమారు రూ.1.78 లక్షల కోట్లకు చేరిందని, 201314తో పోలిస్తే రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 56 రెట్లు పెరిగాయని షా తెలిపారు. భారత రక్షణ ఉత్పత్తులు సుమారు 80 దేశాలకు చేరుతున్నాయని చెప్పారు. ఉత్తరప్రదేశ్ కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం ద్వారా స్థానిక ఉత్పత్తులు, ఉపాధి అవకాశాలు పెరిగాయని పేర్కొన్నారు. భదోహీ కార్పెట్లు, మురాదాబాద్ ఇత్తడి వస్తువులు, ఫిరోజాబాద్ గాజు ఉత్పత్తులు, సహారన్‌పూర్ కలప కళాకృతులు, కన్నౌజ్ పరిమళాలు, బనారసీ చీరలకు దేశవ్యాప్తంగా గుర్తింపు పెరిగిందన్నారు. రాష్ట్రంలో రక్షణ తయారీ నుంచి వైద్య పరికరాల ఉత్పత్తి వరకు పరిశ్రమల విస్తరణ జరుగుతోందని ఆయన వివరించారు.



### 7.8 శాతం వృద్ధిపై షా ప్రశంసలు

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఉన్నా భారత్ వృద్ధిని కొనసాగించడమే కాక మరింత బలోపేతం చేసుకుందని అమిత్ షా అన్నారు. భారత్ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసి ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మౌలిక వసతుల పెట్టుబడులు, సెమీకండక్టర్ రంగం, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు, జీఎస్టీ వసూళ్లను ఆయన ప్రస్తావించారు. మారిషస్, యూఏఈ, బ్రిటన్, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ సహా పలు దేశాలు, వాణిజ్య సమూహాలతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత ఎగుమతులకు అవకాశాలు పెంచాయని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా ప్రారంభమై 12 ఏళ్లు పూర్తైన సందర్భంగా, 2047 నాటికి భారత్‌ను ప్రతి రంగంలో అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యాన్ని ప్రస్తావించారు.

# అధికారం ఉందని గర్వం వద్దు

- పంచాయతీ పోరుకు సిద్ధం కండి!
- బీజేపీ నేతలకు నితిన్ నబిన్ హెచ్చరిక

అధికారంలో ఉన్నామనే గర్వం వద్దు.. ప్రజలతో వినయంగా మెలగాలి అంటూ రాజస్థాన్ బీజేపీ నేతలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టమైన సందేశం ఇచ్చారు. జైపూర్‌లో సీఎం భజన్‌లాల్ నివాసంలో ఉదయం 9.50 నుంచి 11.30 గంటల వరకు జరిగిన అల్పాహార సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, ఎన్నికల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. కొత్తగా రాజస్థాన్‌కు నియమితులైన ప్రభారీలతోనూ నబిన్ చర్చించారు. అధికార మదం పెరిగితే ప్రజల్లో వ్యతిరేకత మొదలైన విషయం నేతలకు ఆలస్యంగా మాత్రమే తెలుస్తుందని ఆయన హెచ్చరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సరళత, సాధారణ జీవనం, ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించాలని సూచించారు.

### టికెట్లు ఇచ్చిన నేతలదే బాధ్యత

ఇటీవల ముగిసిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినా.. అక్కడ జరిగిన పరిణామాలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని నబిన్ సూచించారు. నేతల సిఫారసుతో టికెట్ పొందిన అభ్యర్థి పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఆ బాధ్యత సిఫారసు చేసిన ఎమ్మెల్యే, ఎంపీదేనని స్పష్టం చేశారు. నాగౌర్‌లోని ముండ్వా మున్సిపాలిటీలో బీజేపీకి 10 మంది కౌన్సిలర్లు ఉన్నా.. పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థి గీతాదేవికి ఒక్క ఓటు కూడా రాలేదు. ఆర్ఎల్‌పీ బోర్డు ఏర్పాటు చేయడం బీజేపీకి గట్టి హెచ్చరికగా మారింది. ఇలాంటి పరిస్థితులు పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకోకూడదని నబిన్ సూచించారు.



### 3.73 కోట్ల గ్రామీణ ఓటర్లే అసలు పరీక్ష

రాజస్థాన్‌లో 14,403 గ్రామ పంచాయతీలకు జరగనున్న ఎన్నికలు బీజేపీకి కీలక పరీక్షగా మారాయి. 5.17 కోట్ల మంది ఓటర్లలో 3.73 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు. అంటే రాష్ట్ర ఓటర్లలో 72.16 శాతం మంది పంచాయతీ ఎన్నికల్లో పాల్గొననున్నారు. పట్టణ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, స్థానిక నేతల ప్రభావం కనిపించిన నేపథ్యంలో.. ఇప్పుడు కుల సమీకరణాలు, సామాజిక లెక్కలు, గ్రామస్థాయి సంస్థాగత బలం కీలకం కానున్నాయి. జంతర్‌మంతర్ ఆందోళనల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలపై కేంద్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. బీఎల్ సంతోష్ పర్యటన తర్వాత నితిన్ నబిన్ వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించడం ద్వారా పంచాయతీ ఎన్నికలను పార్టీ విస్తరణకు కీలకంగా భావిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. పట్టణ విజయంతో ఆగకుండా గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో పనిచేయాలని నబిన్ ఆదేశించినట్లు సమాచారం.

# లద్దాఖ్ హింసపై వాంగ్‌చుక్ పోరు

- షా రాజీనామాకు వాంగ్‌చుక్ డిమాండ్
- ఎన్‌కౌంటర్ భయం ఉందని వ్యాఖ్యలు

లద్దాఖ్‌లో గతేడాది జరిగిన హింసపై రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని వాతావరణ కార్యకర్త సోనం వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. తన ప్రభుత్వ వ్యతిరేక స్వరంతో ఎన్‌కౌంటర్‌లో చంపే ప్రమాదం ఉందని హెచ్చరికలు వస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2025 సెప్టెంబర్ 24న రాష్ట్ర హోదా, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ రక్షణ కోసం జరిగిన ఆందోళనల్లో హింస చెలరేగి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటనకు ఏడాది పూర్తైన సందర్భంగా లేహ్‌లో జరిగిన కార్యక్రమంలో వాంగ్‌చుక్ ఈ వ్యాఖ్యలు చేశారు.

### విచారణ నివేదికకు డిమాండ్

గతేడాది ఘటనపై కేంద్రం మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి బీఎస్ చౌహాన్ నేతృత్వంలో న్యాయ విచారణకు ఆదేశించింది. ఆ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని వాంగ్‌చుక్ కోరారు. నివేదిక విడుదల చేయకపోతే స్వతంత్ర ప్రజా ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి పోలీసుల కాల్పులపై విచారణ చేపడతామని హెచ్చరించారు. భద్రతా బలగాలు ఆటోమేటిక్ ఆయుధాలతో కాల్పులు జరిపాయని, ముగ్గురు మేజిస్ట్రేట్లు కాల్పుల ఆదేశాలపై సంతకం చేసేందుకు నిరాకరించారని ఆయన ఆరోపించారు. ఇవన్నీ విచారణలో తేలాల్సిన అంశాలేనని స్పష్టం చేయాలి.

### రాహుల్ గాంధీకి వాంగ్‌చుక్ ప్రశ్న

ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యకు నిరసనగా అమిత్ షా రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ కోరడాన్ని వాంగ్‌చుక్ సమర్థించారు. అదే సమయంలో లద్దాఖ్‌లో నలుగురు మరణించిన ఘటనపై రాహుల్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. లద్దాఖ్‌లో ప్రజలు ప్రజాస్వామ్యం, గౌరవప్రదమైన జీవనం కోసం భారత్‌తో ఉండాలని ఎంచుకున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే గతేడాది హింసపై భద్రతా ఏర్పాట్లు, పోలీసుల చర్యలపై వాంగ్‌చుక్ చేసిన ఆరోపణలను లద్దాఖ్ పోలీసులు ఖండించారు. సభకు ఎవరినీ అడ్డుకోలేదని, బారికేడ్లు ట్రాఫిక్ నియంత్రణ, జనసమ్మర్ద నిర్వహణలో భాగమేనని తెలిపారు.





# సీఈసీ విచారణపై దూకుడు

- సుప్రీం కోర్టుకు ముందుకు పిటిషన్
- సాధారణ నిందితుడిలా విచారించాలి
- రాజ్యాంగ రక్షణ వర్తించదంటూ లాయర్



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పోలీసు దర్యాప్తు, ఆధారాల సేకరణ, సాధారణ న్యాయ విచారణ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి ఈ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది చాంద్ ఖురేషీ ద్వారా దాఖలైన పిటిషన్‌లో, ఎన్నికల ఓటర్ల జాబితా విషయంలో వచ్చిన ఆరోపణలకు అధికారిక విధులతో నేరుగా సంబంధం లేదని వాదించారు. ఇవి నిర్ధారణ అయితే ప్రజాప్రాతినిధ్య చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద నేరాలుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు.

### అధికారిక విధుల పేరుతో రక్షణ కాదని

పిటిషన్ ప్రకారం రికార్డులను ఉద్దేశపూర్వకంగా మార్చడం, నకిలీ పత్రాలు సృష్టించడం, ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడం వంటి చర్యలను అధికారిక విధుల్లో భాగంగా పరిగణించలేం. అలాంటి చర్యలకు పాల్పడితే ప్రభుత్వ అధికారి అనే హోదా చట్టపరమైన రక్షణ ఇవ్వదని పిటిషనర్ వాదించారు. 2023 చట్టంలోని సెక్షన్ 16ను కూడా ఇదే నేపథ్యంలో ప్రస్తావించారు. ఆ నిబంధన ఆధారంగా పోలీసు దర్యాప్తు, అరెస్టు నుంచి సంపూర్ణ రక్షణ ఉందని చెప్పలేమని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### 14 అభ్యంతరాలపై దృష్టి

ఈ పిటిషన్ వెనుక ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలపై వచ్చిన నివేదికలు కీలకంగా మారాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు పలు నిర్ణయాలపై లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, సర్ ప్రక్రియ వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇద్దరు కమిషనర్లు తమకు తెలియకుండా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ నివేదిక తెలిపింది.

### ఎన్నికల వ్యవస్థపైనే కీలక ప్రశ్న

పిటిషన్‌లో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. ఫామ్ 6లో మార్పులు, ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణ, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లపై దాఖలైన అప్పీళ్లు, సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు కాకపోవడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా గోవాలో 97 మంది అర్హులైన ఓటర్ల విషయంలో సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా వారి నిర్ణయాలను నమోదు చేయలేకపోయారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో గ్యానేశ్ కుమార్‌కు వ్యక్తిగత క్రిమినల్ బాధ్యత నుంచి సంపూర్ణ మినహాయింపు లేదని పిటిషన్ వాదిస్తోంది.



# ఈసీపై ప్రశ్నలు

- మిత్రుల నుంచే సూచనలు!
- ప్రజల సందేహాలు తీర్చాలన్న చిరాగ్

ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్న వేళ ఎన్డీఏ భాగస్వామ్య నేతల నుంచే కీలక సూచనలు వచ్చాయి. ఎన్నికల సంఘంపై సందేహాలు వ్యక్తమవుతున్నప్పుడు ప్రజలకు తన వాదనను బలంగా వివరించాల్సిన బాధ్యత ఈసీపై, ముఖ్యంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ఉందని కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ అన్నారు. తాను ప్రభుత్వం తరఫున ఎవరినీ సమర్థించబోనని, ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు రాజకీయంగా ప్రశ్నలు లేవనెత్తడం సహజమేనని, అయితే ఆ ప్రశ్నల కారణంగా ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు ఏర్పడితే వాటిని నివృత్తి చేయడం ఈసీ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతిపక్షానికి సమాధానం ఇవ్వడం కోసం కాకుండా ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు కమిషన్ తన వైఖరిని స్పష్టంగా చెప్పాలని చిరాగ్ సూచించారు.

### ఉపేంద్ర కుష్వాహా సైతం ఇదే డిమాండ్

రాష్ట్రీయ లోక్ మోర్చా అధినేత ఉపేంద్ర కుష్వాహా కూడా ఇదే తరహాలో స్పందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో చాలా గందరగోళం నెలకొన్నందున ఎన్నికల సంఘం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాఖ్యలు ప్రతిపక్షాల నుంచి సీఈసీ రాజీనామా డిమాండ్లు పెరుగుతున్న సమయంలో రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో కొన్ని నిర్ణయాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. ఈ అంశంపై కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు ఉండటం సాధారణ ప్రక్రియలో భాగమేనని, గత ఏడాది తీసుకున్న తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని తెలిపింది.

### బిహార్‌లో వేడెక్కిన రాజకీయం

ఈ వివాదంపై బిహార్‌లో అధికార కూటమి భాగస్వాముల మధ్య భిన్న స్వరాలు వినిపించాయి. జేడీయూ నేత లాలన్ సింగ్ మాత్రం ఎన్నికల సంఘానికి మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ మీడియా నివేదిక ఆధారంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయడం మానుకుని, తమ ఎన్నికల ఓటమికి కారణాలను సమీక్షించుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఆర్జేడీ రాష్ట్రవ్యాప్తంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేస్తూ నిరసనలు చేపట్టింది. పాట్నాతో పాటు పలు జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు జరిగాయి. ఒకే అంశంపై ఎన్డీఏ భాగస్వామ్యుల్లోనే భిన్న స్పందనలు రావడం, ఈసీ నుంచి స్పష్టమైన వివరణ కోరుతున్న స్వరాలు పెరగడం ప్రస్తుతం బిహార్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



# ఎన్నికలు రిగ్గయ్యాయా..

- అలాంటప్పుడు పోటీ ఎందుకు?
- పోటీకి దూరంగా ఉండాలని దిప్కే హితవు

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ప్రతిపక్ష పార్టీలకు కీలక ప్రశ్న సంధించారు. ఎన్నికల ప్రక్రియ రిగ్గవుతోందని ఆరోపిస్తున్నప్పుడు అదే ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు నిజంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా లేవని భావిస్తే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిపక్షాలు ఎన్నికల్లో పాల్గొనడం వల్లే అవి ప్రజాస్వామ్యబద్ధమైనవనే భావనకు బలం చేకూరుతోందని దిప్కే తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

### రాజకీయ ఉనికిపైనే దిప్కే ప్రశ్న

ఎన్నికలకు దూరంగా ఉంటే రాజకీయంగా కనుమరుగవుతామనే భయంతోనే ప్రతిపక్షాలు పోటీ చేస్తున్నాయా అని దిప్కే ప్రశ్నించారు. ఓట్లు దొంగిలిస్తున్నారని, ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని, పార్టీలు చీలిపోతున్నాయని ఆరోపిస్తూ కూడా ఎన్నికల్లో కొనసాగడం ఎంతకాలం సాధ్యమని ఆయన నిలదీశారు. రాజకీయ మనుగడ కంటే ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కొన్ని విజయాలు ప్రతిపక్షాలకు దక్కినా, అవి మొత్తం ప్రక్రియపై నిష్పక్షపాత పోటీ ఉందనే భావన కలిగించేందుకు ఉపయోగపడతాయని దిప్కే అభిప్రాయపడ్డారు.

### 'జంతర్ మంతర్ 2.0' హెచ్చరిక

ఎన్నికల అవకతవకల ఆరోపణలను రాష్ట్రం, పార్టీ ఆధారంగా కాకుండా ప్రతిచోటా ఒకే విధంగా ప్రశ్నించాలని దిప్కే కోరారు. ప్రజాస్వామ్య ప్రయోజనాలను రాజకీయ ప్రయోజనాల కంటే ముందుకు తీసుకురావాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని దిప్కే డిమాండ్ చేశారు. డిమాండ్ నెరవేరకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని, ఢిల్లీలో 'జంతర్ మంతర్ 2.0' నిర్వహిస్తామని ప్రకటించారు. సీజేపీ ఇప్పటికే ఎన్నికల సంఘం సంస్కరణల కోసం దేశవ్యాప్త 'ఎలక్షన్ కమిషన్ ఠీక్ కరో' ప్రచారాన్ని ప్రకటించింది.

# మహిళ మార్ఫింగ్ ఫొటోలపై హైకోర్టు సీరియస్

- 24 గంటల్లో తొలగించాలని మెటాకు ఆదేశాలు
- సీజేపీ నేతలకు కోర్టు నోటీసులు జారీ

జంతర్ మంతర్ ఆందోళనల సమయంలో ఓ మహిళ ఫొటోను అనుమతి లేకుండా మార్ఫింగ్ చేసి ప్రచారం చేశారన్న ఆరోపణలపై ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. సౌరవ్ దాస్, అభిజీత్ దిప్కే, ఆశుతోష్ రాంకా, రత్నా సింగ్‌లకు నోటీసులు జారీ చేసింది. సోషల్ మీడియా సంస్థ మెటాకు కూడా కీలక ఆదేశాలు ఇచ్చింది. మహిళకు సంబంధించిన అభ్యంతరకర ఫొటోలు, లింకులను తన ప్లాట్‌ఫామ్‌ల నుంచి 24 గంటల్లో తొలగించాలని ఆదేశించింది. మహిళకు పోలీసు రక్షణ కల్పించాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించిన కోర్టు.. కేసుపై రెండు వారాల్లో స్టేటస్ రిపోర్టు సమర్పించాలని సూచించింది. ఈ వ్యవహారం ఒక్క మహిళకు సంబంధించినది కాదని, దేశ ప్రధానికి సంబంధించిన అంశం కావడంతో అధికారులు సున్నితంగా వ్యవహరించాలని జస్టిస్ గిరీష్ కత్పాలియా వ్యాఖ్యానించారు.

ఏఐ మార్ఫింగ్‌పై పోలీసుల దర్యాప్తు

జంతర్ మంతర్‌లో సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనల్లో తన ఫొటోను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫేస్‌స్వాప్ టెక్నాలజీతో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోతో కలిపి మార్ఫింగ్ చేశారని మహిళ ఆరోపించారు. ఆ చిత్రాలను భారీ బ్యానర్లు, పోస్టర్లపై ఉపయోగించడంతో పాటు అభ్యంతరకర నినాదాలు చేశారని, వీడియోను ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారం చేశారని ఫిర్యాదు చేశారు. పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే నోటీసులు అందుకున్న సీజేపీ నేతలను ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొనలేదు. జూన్ 20న ప్రారంభమైన సీజేపీ ఆందోళన జూలై 25 వరకు కొనసాగింది. పార్లమెంట్ వైపు మార్చ్ సందర్భంగా భద్రతా సిబ్బందితో ఘర్షణలు జరగడంతో లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం జరిగింది. అనంతరం ఆందోళన విరమించారు.

# ఈసీపై పోరు.. దేశవ్యాప్తంగా నిరసనలు

## జ్ఞానేశ్ రాజీనామాకు కాంగ్రెస్ పిలుపు



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఢిల్లీ, పట్నా, కోల్‌కతా, జమ్మూ, అసోం, ఒడిశా, మేఘాలయ, హిమాచల్‌ప్రదేశ్ సహా పలు ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీలు నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై స్వతంత్ర సమీక్ష చేపట్టాలని, సీఈసీపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద భారీగా పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. అసోంలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్నాలో నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కేనన్లు ఉపయోగించారు.

### జంతర్‌మంతర్ వద్ద పలువురు అరెస్ట్

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అరెస్టు, రాజీనామా కోరుతూ ఏఐఎస్ఏ నిర్వహించిన ఆందోళనలో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, కార్యకర్త యోగేంద్ర యాదవ్ తదితరులు అదుపులోకి తీసుకున్న వారిలో ఉన్నారు. ఢిల్లీ పోలీసుల ప్రకారం సుమారు 40-50 మందిని అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనకు ముందస్తు అనుమతి తీసుకోలేదని పోలీసులు తెలిపారు. నిరసనకారులను తరువాత విడుదల చేసినట్లు కూడా అధికారులు పేర్కొన్నారు. మరోవైపు పోలీసుల చర్యపై ఆందోళనకారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

### 14 అభ్యంతరాలతో దుమారం

ఈ ఆందోళనలకు ప్రధాన నేపథ్యం ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలపై వచ్చిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు కొన్ని నిర్ణయాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ నివేదిక పేర్కొంది. SIRతో పాటు ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణలు, ఫారం 6 మార్పులు వంటి అంశాలు ఈ అభ్యంతరాల్లో ఉన్నట్లు వెల్లడించింది. ఎన్నికల సంఘం మాత్రం భిన్నాభిప్రాయాలు సంస్థాగత నిర్ణయ ప్రక్రియలో భాగమేనని, గత ఏడాది తీసుకున్న తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని తెలిపింది. ఇదే అంశంపై ప్రతిపక్ష పార్టీలు సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసనలు ముమ్మరం చేశాయి.

### బహిరంగ పోరుగా మారిన వివాదం

ఈసీ వివాదం ఇప్పుడు రాజకీయ ప్రకటనల నుంచి వీధి నిరసనల వరకు విస్తరించింది. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో SIR ప్రక్రియపై న్యాయపరమైన సవాళ్లు కూడా కొనసాగుతున్నాయి. మరోవైపు సీఈసీపై చర్యలకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేతలు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. సీఈసీపై వచ్చిన ఆరోపణలు, ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలు, ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణ ఇప్పుడు మొత్తం వివాదానికి కేంద్రంగా మారాయి. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ కూడా పేర్కొన్నారు.

# జ్ఞానేశ్ రాజీనామాతో ఆగదు

- అక్రమార్కులందరిపై చర్యలు!
- ఎస్పీ ఎంపీ డింపుల్ యాదవ్



ఎన్నికల సంఘంపై కొనసాగుతున్న వివాదం మరింత ముదురుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఒక్కరే కాకుండా వివాదాస్పద నిర్ణయాల్లో భాగమైన అధికారులు, ఎన్నికల ప్రక్రియకు బాధ్యులైన వారందరూ పదవుల నుంచి తప్పుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నిర్వహణపై తమ పార్టీ చాలాకాలంగా ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆమె చెప్పారు. 2022 ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాలో అవకతవకలపై అఫిడవిట్లు సమర్పించినా ఎన్నికల సంఘం నుంచి స్పందన రాలేదని డింపుల్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఐటీ వ్యవస్థ, సంబంధిత అధికారులు కూడా బాధ్యత వహించాలని ఆమె అన్నారు. అయితే ఇవన్నీ ప్రతిపక్షం చేసిన ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన నిర్ణయాలు పూర్తి కమిషన్ ఆమోదంతోనే జరిగాయని స్పష్టం చేసింది.

### ఇంపీచ్‌మెంట్‌కు ఎస్పీ పూర్తి మద్దతు

జ్ఞానేశ్ కుమార్‌పై చర్యల విషయంలో సమాజ్‌వాదీ పార్టీ తన వైఖరిని డింపుల్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు చేపడుతున్న ఇంపీచ్‌మెంట్ ప్రక్రియకు ఎస్పీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్ ప్రారంభించిన ఇంపీచ్‌మెంట్ ప్రతిపాదనకు తమ పార్టీ మద్దతుగా సంతకం చేసిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా మాత్రమే కాకుండా సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. జ్ఞానేశ్ కుమార్‌పై చర్యల కోసం ప్రతిపక్షం పార్లమెంట్ ఉభయ సభల్లో మరోసారి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సీఈసీని తొలగించే ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగింపు విధానంతో సమానంగా ఉంటుంది.

### 14 అభ్యంతరాలే రాజకీయ దుమారం

డింపుల్ యాదవ్ వ్యాఖ్యలకు నేపథ్యంగా ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలపై వెలువడిన నివేదికలు ఉన్నాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఎస్ఐఆర్, ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణలు, అప్పీలు, ఫారం 6 మార్పులు వంటి అంశాలు ఇందులో ఉన్నట్లు పేర్కొంది. ఫారం 6లో చేసిన కొన్ని మార్పులను ఇద్దరు కమిషనర్లు 'అనధికారికం', 'చట్టవిరుద్ధం'గా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు నివేదిక తెలిపింది. ఎన్నికల సంఘం మాత్రం భిన్నాభిప్రాయాలు సంస్థాగత చర్చల్లో సహజమేనని, గత ఏడాది తీసుకున్న తుది నిర్ణయాలన్నీ పూర్తి కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయని ప్రకటించింది. ఈ నేపథ్యంలో డింపుల్ యాదవ్ తాజా వ్యాఖ్యలు ప్రతిపక్ష ఉద్యమానికి మరింత రాజకీయ ప్రాధాన్యం తీసుకొచ్చాయి.

# సీఈసీ తొలగింపుపై కాంగ్రెస్ నిరసన

- బారికేడ్లు దాటేందుకు గొగోయ్ యత్నం
- సీఈసీ తొలగించాలంటూ ఆందోళన



అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎంపీ గౌరవ్ గొగోయ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గువాహటిలో కాంగ్రెస్ నిరసన చేపట్టింది. రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం రాజీవ్ భవన్ నుంచి పార్టీ నేతలు ర్యాలీగా బయలుదేరారు. అనంతరం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం వద్దకు వెళ్లి సీఈసీ దిష్టిబొమ్మ దహనం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది.

### బారికేడ్లు దాటే ప్రయత్నం

రాజీవ్ భవన్ సమీపంలోనే పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అయితే గౌరవ్ గొగోయ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు నిరసనకారులను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో గువాహటి ప్రాంతంలో కొంతసేపు రాజకీయ ఉద్రిక్తత నెలకొంది.

### పలువురు నేతలు అదుపులోకి

గౌరవ్ గొగోయ్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శి మనోజ్ చౌహాన్, సేవాదళ్ అధ్యక్షుడు దీప్ బాయన్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉదిత్ భాను దాస్ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఈసీపై తమ నిరసనను తెలియజేసేందుకు కాంగ్రెస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

### ప్రజాస్వామ్యానికి బెదిరింపు

కాంగ్రెస్ అధికార ప్రతినిధి బెదబ్రత బోరా పోలీసుల చర్యను తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ నేతలను బలవంతంగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఈ చర్య ప్రజాస్వామ్యానికి మరో ముప్పుగా మారుతోందని ఆయన వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాల నుంచి విమర్శలు కొనసాగుతున్న సమయంలో అసోంలో జరిగిన ఈ నిరసన ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితాల సవరణపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ సీఈసీ తొలగింపు డిమాండ్‌తో కాంగ్రెస్ చేపట్టిన ఆందోళన రాజకీయంగా చర్చనీయాంశమైంది.



# జ్ఞానేశ్‌కు రక్షణ లేదా?

- అరెస్ట్‌కు ఛాన్స్ ఉందా?
- పిటిషన్‌లో కొత్త మలుపు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలన్న ప్రతిపక్ష డిమాండ్ ఇప్పుడు సుప్రీంకోర్టు గడపకు చేరింది. ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు చేశారన్న ఆరోపణలపై ఆయనను విచారించాలని దాఖలైన పిటిషన్ కీలక న్యాయ ప్రశ్నను లేవనెత్తింది. 2023లో పార్లమెంట్ ఆమోదించిన చట్టంలోని సెక్షన్ 16 విధుల్లో భాగంగా చేసిన చర్యలపై సీఈసీ, ఎన్నికల కమిషనర్లపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకుండా రక్షణ కల్పిస్తోంది. అయితే ఓటర్ల జాబితాలో ఉద్దేశపూర్వకంగా అక్రమ మార్పులు చేస్తే అది అధికారిక విధుల్లో భాగమా కాదా అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### 14 అభ్యంతరాలతో పెరిగిన వివాదం

సెప్టెంబర్ 23న వెలుగులోకి వచ్చిన నివేదిక ప్రకారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, ఫారం 6లో మార్పులు వంటి అంశాలు ఈ వివాదానికి కేంద్రంగా నిలిచాయి. ప్రతిపక్షాలు వీటిని ఆధారంగా చేసుకుని జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం భిన్నాభిప్రాయాలు అంతర్గత చర్చల్లో సాధారణమేనని, ఎస్ఐఆర్‌తో సహా తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది.

### ఫామ్-6 మార్పుపై అసలు ప్రశ్న

కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫామ్ 6లో మార్పులు కూడా వివాదానికి కారణమయ్యాయి. జూలై 2026లో ఆన్‌లైన్ ఫామ్ 6లో కొత్త డిక్లరేషన్ చేర్చినట్లు నివేదికలు వెల్లడించాయి. ఇదే అంశాన్ని జ్ఞానేశ్ కుమార్ అధికారిక విధులకు బయట చేసిన చర్యగా పిటిషనర్ అభివర్ణించారు. ఓటర్ల జాబితా తారుమారు చేశారన్న ఆరోపణలు నిరూపితమైన విషయాలు కావు. అయితే పిటిషన్‌లో పేర్కొన్న ఆరోపణలు నిజమైతే అవి అధికారిక విధుల రక్షణ పరిధిలోకి వస్తాయా అన్నది న్యాయస్థానం పరిశీలించాల్సిన అంశంగా మారింది.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట



ప్రొద్దుటూరు పట్టణంలోని ఒకటో బాలాజీనగర్‌లో జరుగుతున్న రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నిర్ణీత నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని గుత్తేదారులను ఆదేశించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సహకారంతో రూ.292 కోట్లు మంజూరైనట్లు కమిషనర్ తెలిపారు. నిధులతో చేపట్టే పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పలు ప్రాంతాల్లో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వివరించారు. ప్రతి పనిని నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యతపై ప్రజలు కూడా పర్యవేక్షణ చేయాలని, ఎలాంటి సందేహాలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. పట్టణ అభివృద్ధి కోసం చేపడుతున్న పనులు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మురళి, రామకృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌కు సమస్యల వెల్లువ




ప్రొద్దుటూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పించన్లు, ఇళ్ల స్థలాలు, రెవెన్యూ, భూ వివాదాలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే స్వయంగా వినతులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వరదరాజుల రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ పట్నం లక్ష్మణ్‌కుమార్, శివాలయం చైర్మన్ వంగల నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ కాకుమాని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఐటీలో ఫ్రెషర్స్ డే సందడి




ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నూతనంగా చేరిన ప్రథమ సంవత్సరం బీటెక్, డిప్లొమా విద్యార్థులకు శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థుల సందడితో కళాశాల ప్రాంగణం ఉత్సాహంగా మారింది. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని చైర్మన్ సూచించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని గ్లోబల్ స్థాయిలో ఎదగాలని వైస్ ప్రెసిడెంట్ కోరారు. ఆధునిక ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, ప్లేస్‌మెంట్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కరస్పాండెంట్ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి నాణ్యమైన విద్యతో పాటు పరిశోధనాత్మక ఆలోచనలు, నైతిక విలువలు పెంపొందించుకోవాలని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వెంకటేశ్వర్‌రెడ్డి సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. అనంతరం సీనియర్లు కొత్త విద్యార్థులను ఆత్మీయంగా ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతో ఆరోగ్యవంతమైన బాల్యం



ప్రొద్దుటూరులో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ఎస్‌వీవీ, డీబీసీఎస్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించి, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. గీత మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల పిల్లలు, కిశోరుల్లో నులిపురుగుల సంక్రమణను నివారించడం ద్వారా ఆరోగ్యం, పోషక స్థితి మెరుగుపడతాయని తెలిపారు. కలుషిత ఆహారం, నీరు, అపరిశుభ్ర పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత లోపం వల్ల నులిపురుగుల సమస్య తలెత్తుతుందని వివరించారు. రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, కడుపునొప్పి, బలహీనత, బరువు తగ్గడం వంటి సమస్యలు రావచ్చన్నారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవడం, గోళ్లు చిన్నగా ఉంచుకోవడం, శుభ్రమైన నీరు తాగడం, ఆహారాన్ని భద్రంగా ఉంచడం, చెప్పులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డా. మురళీకృష్ణారెడ్డి, డా. మధుకుమార్, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు శేషు, రమేష్, అరుంధతి పాల్గొన్నారు.




# స్మార్ట్ కిచెన్ లో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ

వేంపల్లి మండలంలోని డొక్కా సీతమ్మ స్మార్ట్ కిచెన్ ను డీఆర్ డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, పులివెందుల నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. భోజన తయారీ, పరిశుభ్రత, పంపిణీ ఏర్పాట్లను తనిఖీ చేసి ఆహారం రుచికరంగా, పరిశుభ్రంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలోని 18 పాఠశాలల్లో 1,958 మంది విద్యార్థులకు స్మార్ట్ కిచెన్ ద్వారా భోజనం అందిస్తున్నట్లు వెల్లడించారు. నిర్ణీత సమయానికి విద్యార్థులకు భోజనం చేరేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. స్మార్ట్ కిచెన్ సిబ్బంది పనితీరును రాజ్యలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ శ్రీనివాసులు, ఏపీఎం వెంకటేశ్వరరావు, మండల సమాఖ్య కార్యదర్శి షబ్రూన్, కిచెన్ మేనేజర్ కవిత, డిస్పాచ్ మేనేజర్ కమల, సీసీ రెడ్డయ్య, అకౌంటెంట్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

# భజన్ క్లబ్బింగ్ లో మోదీ సందడి

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం భజన్ క్లబ్బింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘ్ పరివార్ సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సంగీత కచేరీ తరహాలో సాగిన భజన్ క్లబ్బింగ్ లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలకు చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. ముందువరుసలో కూర్చున్న మోదీ శ్రీరాముడిపై ఆలపించిన భజన్ కు చప్పట్లు కొడుతూ, టాంబురిన్ తరహా వాయిద్యాన్ని వాయించారు. సంప్రదాయ ఆధ్యాత్మిక గీతాలను ఆధునిక, ఉత్సాహభరితమైన అకౌస్టిక్ లేదా ఎలక్ట్రానిక్ సంగీతంతో కలిపి యువతకు చేరువ చేసే కొత్త సాంస్కృతిక ధోరణిగా భజన్ క్లబ్బింగ్ గుర్తింపు పొందుతోంది. మద్యం లేని క్లబ్ వాతావరణంలో జరిగే ఈ కార్యక్రమాలు భారత్ లోని పలు నగరాలతో పాటు విదేశాల్లోనూ ఆదరణ పొందుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.





**గ్రామీణ మౌలిక వసతులపై మోదీ ప్రశంసలు**

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం 'సేవా యాత్ర'లో పాల్గొంటున్న ప్రతినిధులతో వర్చువల్ గా మాట్లాడారు. గత 12 ఏళ్లలో దేశంలోని గ్రామాలు, నగరాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడ్డాయని ఆయన పేర్కొన్నారు. 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ మహిళల్లో స్వావలంబన పెరిగిందని మోదీ తెలిపారు. రాజకీయాలకే పరిమితం కాకుండా సమాజంలో నిరంతర సంస్కరణలు, సానుకూల మార్పుల కోసం పనిచేయాలని సేవా యాత్రికులకు సూచించారు. మోదీ 76వ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 17న వడ్నగర్, వారణాసి నుంచి రెండు బైక్ ర్యాలీలు ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 7న ముగియనున్న ఈ యాత్రలు మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తుచేస్తున్నాయి. వడ్నగర్ మోదీ జన్మస్థలం కాగా, వారణాసి 2014 నుంచి ఆయన లోక్ సభ నియోజకవర్గం. పట్టణాలు, జిల్లాలు, గ్రామాల మీదుగా సాగుతున్న యాత్రల్లో సేవ, ప్రజలతో అనుసంధానం, యువత భాగస్వామ్యం, సామాజిక సంక్షేమం, సాంస్కృతిక అనుసంధానం, సామాజిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

# 52 వార్డులపై వైఎస్సార్‌సీపీ ఎన్నికల కసరత్తు





ప్రొద్దుటూరులో కొత్తగా ఏర్పడిన 52 మున్సిపల్ వార్డుల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ స్థానిక ఎన్నికల సన్నద్ధతను ముమ్మరం చేసింది. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం ముఖ్య నాయకులతో సమావేశమై వార్డుల విభజన, ఓటర్ల జాబితా, స్థానిక పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ప్రతి వార్డులో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి లోటుపాట్లను గుర్తించాలని నాయకులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని రాచమల్లు పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ సంస్థాగతంగా బలోపేతం కావాలని కోరారు. స్థానిక స్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై వార్డుల వారీగా పరిస్థితులను అధ్యయనం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు తన పూర్తి సహకారం ఉంటుందని రాచమల్లు భరోసా ఇచ్చారు. సమావేశంలో పలువురు ముఖ్య నాయకులు పాల్గొని స్థానిక ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.

# రెవెన్యూ సదస్సుతో సమస్యలకు పరిష్కారం




పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ విస్టాలో పులివెందుల, లింగాల మండలాల ప్రజల కోసం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో జరిగిన కార్యక్రమంలో భూ సమస్యలు, రెవెన్యూ రికార్డులు, పట్టాలకు సంబంధించిన వినతులను అధికారులు స్వీకరించారు. పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, మద్దూరు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్ లో ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు వివరించారు. రికార్డుల పరిశీలనతో కొన్ని భూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరింత పరిశీలన అవసరమైన వినతులను సంబంధిత శాఖలకు అప్పగించారు. నిబంధనల ప్రకారం సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా అధికారులను కలిసి తమ సమస్యలకు పరిష్కారం పొందేందుకు ఈ సదస్సు ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల జాబితాపై కాంగ్రెస్ సమరశంఖం

తెలంగాణలో ఎస్ ఐఆర్ ప్రక్రియను ఈసీ నిర్వహిస్తున్న తీరును నిరసిస్తూ సెప్టెంబరు 28న అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపడతామని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణపై ఈసీ పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ ఐఆర్ తో పాటు ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, డేటాబేస్, సాఫ్ట్ వేర్ మార్పులపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలపై ఈసీ వివరణ ఇవ్వాలని కోరారు. ఫారం 6లో ప్రతిపాదించిన మార్పులకు చట్టపరమైన ప్రాతిపదిక, వాటి అమలు విధానాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల డేటాలో

మార్పులు చేసిన అధికారి ఎవరు, ఎప్పుడు, ఏ కారణంతో, ఎవరి అనుమతితో చేశారో ఆడిట్ ట్రయల్ ద్వారా తెలుసుకునేలా వ్యవస్థ ఉండాలని అన్నారు. ఎస్ ఐఆర్ లో తొలగించిన పేర్ల రాష్ట్ర, నియోజకవర్గాల వారీ వివరాలు, తొలగింపుల కారణాలు, వచ్చిన అభ్యంతరాలు, పునరుద్ధరించిన పేర్ల సంఖ్యను బహిర్గతం చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

# అక్రమ కేసులపై అంబటి రాంబాబు ఫైర్



వైఎస్సార్‌సీపీ నేతలపై నమోదైన కేసులను నిరసిస్తూ శనివారం విజయవాడ సీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. డీఎస్పీ అక్రమాలపై ప్రశ్నించినందుకు అర్ధరాత్రి ఇళ్లలోకి వెళ్లి అరెస్టులు చేయడం, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం సెక్షన్లు పెట్టి జైలుకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సెక్షన్లు ఎలా వర్తిస్తాయని కోర్టు ప్రశ్నించినప్పుడు ప్రభుత్వ న్యాయవాది సమాధానం చెప్పలేకపోయారని అంబటి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై రౌడీషీట్లు తెరవడం సరికాదన్నారు. కాదంబరి జత్వానీ కేసులో పోలీసుల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం డీఎస్పీ వ్యవహారంలో ఉన్న ఉపాధ్యాయులను కూడా దుర్గగుడికి తీసుకెళ్లి దర్శనం చేయించారని ఆరోపించారు. కాకుమాను రాజశేఖర్ మృతికి పోలీసుల వ్యవహారశైలే కారణమని అంబటి ఆరోపించారు. తనపై ఈడీ విచారణకు పూర్తిగా సహకరిస్తానని, ఈడీ కేసులకు భయపడనని స్పష్టం చేశారు. తనపై ఎల్లోమీడియాలో ఊహాగానాలతో కథనాలు ప్రచురిస్తున్నారని విమర్శించారు.

## తండ్రిని హత్య చేసిన కొడుకుకు జీవితఖైదు



డబ్బుల కోసం కన్నతండ్రిని గొడ్డలితో నరికి చంపిన కుమారుడికి మహబూబ్‌నగర్ ఫ్యామిలీ కోర్టు కమ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.ఆంజనేయులు జీవితఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. రాజాపూర్ మండలం రాయపల్లి గ్రామానికి చెందిన కవాలి నదేశ్ అలియాస్ ఆనంద్ ఎలాంటి పని చేయకుండా డబ్బుల కోసం తల్లిదండ్రులతో తరచూ గొడవపడేవాడని పోలీసులు తెలిపారు. 2024 సెప్టెంబర్ 19న రాత్రి మరోసారి తల్లిదండ్రులతో గొడవపడి తండ్రి కవాలి నారాయణను గొడ్డలితో మెడపై నరికాడు. తీవ్రంగా గాయపడిన నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు రాజాపూర్ ఎస్ఐ రవి కేసు నమోదు చేశారు. జడ్చర్ల రూరల్ సీఐ టి.నాగార్జున గౌడ్ దర్యాప్తు చేసి ఆధారాలను కోర్టుకు సమర్పించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నదేశ్‌కు జీవితఖైదు ఖరారు చేశారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించారు.

## క్రీడలతో విద్యార్థుల్లో ప్రతిభ వికాసం




వేంపల్లి రామకృష్ణపురం, నందిపల్లె స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్ట్ లో వేంపల్లి టీడీపీ ఇన్ చార్జి అజ్జుగుట్టు రఘునాథ రెడ్డి పాల్గొన్నారు. రామకృష్ణ మిషన్ స్వామి సుకృతానందతో కలిసి విద్యార్థుల క్రీడా పోటీలను వీక్షించి వారిని అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు స్పోర్ట్స్ ఫెస్ట్ లు ఎంతో ఉపయోగపడతాయని రఘునాథరెడ్డి పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలపైనా విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల వంటి లక్షణాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు. స్పోర్ట్స్ ఫెస్ట్ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రఘునాథ రెడ్డి, స్వామి సుకృతానంద విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# ఆరోగ్యశ్రీతో చిన్నారికి పునర్జన్మ





రెండు నెలల పాపకు ఉచిత న్యూరో సర్జరీనూజివీడు నియోజకవర్గం కొర్లగుంటకు చెందిన మహేష్, వినీల దంపతుల కుమార్తె ధన్సికకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా క్లిష్టమైన న్యూరో సర్జరీ జరగడంతో ప్రాణాపాయం నుంచి బయటపడిందని తల్లిదండ్రులు తెలిపారు. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే, రెండు నెలల వయసున్న ధన్సిక తీవ్ర అనారోగ్యానికి గురైందని చెప్పారు. ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించడంతో చిన్నారి కోలుకుందని వివరించారు. ప్రస్తుతం ధన్సిక ఆరోగ్యంగా పెరుగుతోందని, తమ కుమార్తెకు అందిన వైద్యసాయం కుటుంబానికి ఎంతో మేలు చేసిందని తల్లిదండ్రులు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా లభించిన చికిత్సను జీవితాంతం మరిచిపోలేమని, వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో జగన్ ఆప్యాయ పలకరింపు**

గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ధన్సిక తల్లిదండ్రులు కలిసి తమ కుమార్తెను పరిచయం చేశారు. ఈ సందర్భంగా జగన్ చిన్నారిని ఆప్యాయంగా పలకరించి, ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని ధన్సికకు సూచించి ఆశీర్వదించారు. చిన్నారి, తల్లిదండ్రుల కోరిక మేరకు వారితో కలిసి సెల్ఫీ దిగారు. తమ కుమార్తెకు ఆరోగ్యశ్రీ ద్వారా అందిన ఉచిత వైద్యం కుటుంబానికి ఎంతో అండగా నిలిచిందని మహేష్, వినీల దంపతులు పేర్కొన్నారు. అప్పట్లో అందిన చికిత్సతో తమ కుమార్తె కోలుకోవడం తమ కుటుంబానికి మరపురాని అనుభవమని తెలిపారు. ధన్సిక ఆరోగ్యంగా ఎదుగుతున్నందుకు సంతోషంగా ఉందని చెబుతూ, వైద్యసాయం అందించిన వ్యవస్థకు తమ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు

# కబ్జా కోరల్లో చీరాల తీరం



చీరాల తీర ప్రాంత భూముల వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా, పరిపాలనా పరంగా చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ చేసిన ఆరోపణలు ఈ అంశాన్ని మరోసారి ప్రజల ముందుకు తీసుకొచ్చాయి. తీర ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూముల రికార్డుల్లో మార్పులు జరిగాయని, అక్రమ లేఔట్లు వెలుస్తున్నాయని, అధికారులు తగిన స్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదని ఆమంచి ఆరోపించారు. సెప్టెంబర్ 18న చీరాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా రామాపురంలో సుమారు 26 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులు నిబంధనలకు విరుద్ధంగా మార్చినట్లు ఆరోపించారు. పర్యవేక్షించాల్సిన అధికారుల పాత్రపైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఆరోపణలకు సంబంధించి తన వద్ద పలు ఆధారాలు ఉన్నాయని, ఉన్నతాధికారులను కలిసి వివరాలు అందిస్తానని ఆమంచి చెప్పారు. ఆయన చేసిన ఆరోపణలు ప్రస్తుతం ఆరోపణల స్థాయిలోనే ఉన్నా, చీరాల తీర ప్రాంతంలో భూముల వినియోగం, లేఔట్ల అనుమతులు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల రికార్డులపై అధికారిక పరిశీలన అవసరమనే ప్రశ్నను ముందుకు తెచ్చాయి. చీరాల ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి పెరగడంతో తీరానికి సమీపంలోని భూముల ధరలు కూడా పెరిగాయని ఆమంచి పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు నిబంధనలను పక్కన పెట్టి భూములను అక్రమ మార్గంలో అభివృద్ధి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే ఏ భూమి అక్రమంగా మారింది, ఎవరి పేరుతో రికార్డులు మార్చారు.. ఏ అధికారి ఏ స్థాయిలో వ్యవహరించారు... వారికి స్థానిక ఎమ్మెల్యే అండదండలున్నాయా.. అనే అంశాలను ఆయన నిర్ధారించలేదు. చీరాల భూవ్యవహారంలో ఇదే కీలక అంశంగా మారింది. ఆమంచి ఆరోపణలు రాజకీయ ప్రకటనగా మాత్రమే చూడాలా? లేక అధికారిక రికార్డుల






## భూబకాసురుల చేతిలో విలవిల

### ఆమంచి ఆరోపణలు.. ప్రభుత్వ పెద్దల మౌనం

### సముద్ర సరిహద్దు భూములు దోచేస్తున్నారా?



**398 ఎకరాలా.. 1200 ఎకరాలా?**

చీరాల భూముల వ్యవహారంలో మరో ముఖ్యమైన అంశం లేఔట్ల విస్తీర్ణం. ఆమంచి మీడియాతో మాట్లాడిన సమయంలో చీరాల ప్రాంతంలో దాదాపు 1,200 ఎకరాల్లో అనుమతులు లేని లేఔట్లు ఉన్నాయని ఆరోచారు. అదే సమయంలో అధికారులకు సమర్పించిన లిఖితపూర్వక ఫిర్యాదులో కొత్తపేట, అక్కాయపాలెం, ఈపురుపాలెం, నాయినిపల్లి రెవెన్యూ గ్రామాలకు సంబంధించి సుమారు 398.04 ఎకరాల అనధికార లేఔట్ల వివరాలను సర్వే నంబర్ల వారీగా ప్రస్తావించారు. ఈ రెండు సంఖ్యలకు సంబంధించి ఆధారాలు పరిశీలించాల్సి ఉంది. ఆమంచి చేస్తోన్నట్టుగా, 1,200 ఎకరాలు విస్తృత ఆరోపణగా, 398.04 ఎకరాలు ఫిర్యాదులో పేర్కొన్న నిర్దిష్ట భూవివరాలుగా చూడాల్సి ఉంటుంది. ఆమంచి ఫిర్యాదులో ఈసీ వివరాలు, భౌతిక పరిస్థితులను చూపించే ఫొటోలను జత చేశారు. వ్యవసాయ భూములు హౌస్ సైట్లుగా, ప్లాట్లుగా మారినట్లు రిజిస్ట్రేషన్ వివరాల్లో కనిపిస్తున్నాయని ఆయన వాదిస్తున్నారు. అయితే రిజిస్ట్రేషన్ జరిగిందనే కారణంతోనే లేఔట్ అక్రమమని తేలదు. అదే విధంగా లేఔట్ అభివృద్ధి కనిపించిందనే కారణంతో భూమి చట్టవిరుద్ధంగా మార్చబడిందని కూడా తక్షణ నిర్ణయం తీసుకోలేం. భూమి స్వభావం ఏమిటి, భూమి వినియోగ మార్పునకు అనుమతి ఉందా, లేఔట్‌కు సంబంధిత సంస్థ ఆమోదం ఇచ్చిందా, రోడ్లు, ఓపెన్ స్పేస్, ఇతర ప్రజా అవసరాల కోసం నిబంధనల ప్రకారం స్థలం వదిలారా అనే అంశాలను పరిశీలించాలి. ఆమంచి ఆరోపణలోని అసలు ప్రశ్న కూడా ఇదే. భూమి ఎంత అన్నదానికంటే, ఆ భూమికి అనుమతులు ఎలా వచ్చాయన్నది కీలకం. చీరాలలో కొత్తపేట నుంచి నాయినిపల్లి వరకు భూములపై ఫిర్యాదు రావడంతో సర్వే నంబర్ల ఆధారంగా క్షేత్రస్థాయి తనిఖీ జరిగితేనే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది. రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుమతులు ఒకదానితో ఒకటి సరిపోతే వివాదానికి సమాధానం దొరుకుతుంది. సరిపోకపోతే తదుపరి చర్యలకు మార్గం ఏర్పడుతుంది.

**• సీఆర్‌జడ్ భూములపై పెరిగిన ఉత్కంఠ**

చీరాల తీర ప్రాంత భూముల విషయంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలు మరో కీలక అంశంగా మారాయి. కొత్తపేట గ్రామంలోని సర్వే నంబర్ 408/1బీలో సుమారు 22 ఎకరాలు సీఆర్‌జడ్ పరిధిలో ఉన్నాయని ఆమంచి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో నిర్మాణాలకు సాధారణ భూములతో పోలిస్తే ప్రత్యేక నియంత్రణలు ఉంటాయి. అందువల్ల సంబంధిత భూమి ఏ సీఆర్‌జడ్ కేటగిరీలోకి వస్తుంది, ఆ ప్రాంతానికి సంబంధించిన అధికారిక మ్యాప్‌లో దాని స్థానం ఏమిటి, అక్కడ ఏ రకమైన నిర్మాణాలకు అనుమతి ఉంటుంది, అవసరమైన అనుమతులు తీసుకున్నారా అనే అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. ఆమంచి ఆరోపణ ప్రకారం తీరానికి సమీపంగా కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, ప్లాట్ల అభివృద్ధి జరిగినట్లు ఫొటోల ద్వారా చూపించారు. దీనిపై అధికారిక తనిఖీ జరిగితే భౌతిక పరిస్థితి, రెవెన్యూ రికార్డులు, సీఆర్‌జడ్ మ్యాపింగ్, నిర్మాణ అనుమతులు పరస్పరం సరిపోతున్నాయా అన్నది తెలుస్తుంది. ఇదే సందర్భంలో రామాపురంలోని ప్రభుత్వ భూముల రికార్డులపై కూడా ఆమంచి తీవ్ర ఆరోపణలు చేశారు. సుమారు 26 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులు మార్చినట్లు ఆయన చెప్పారు. అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కయ్యారని కూడా ఆరోపించారు. తన విమర్శలకు తగిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆమంచి స్పష్టం చేశారు. రికార్డు మార్పు జరిగిందా, జరిగితే ఎప్పుడు జరిగింది, ఎవరి ఆదేశంతో జరిగింది, పాత రికార్డులు ఏం చెబుతున్నాయి, ప్రస్తుత రికార్డులు ఏం చెబుతున్నాయి అన్నది రెవెన్యూ శాఖ పరిశీలనలో తేలాల్సి ఉంది. చీరాల తీరంలో భూముల విలువ పెరుగుతున్న నేపథ్యంలో సీఆర్‌జడ్ నిబంధనల అమలు మరింత ప్రాధాన్యం పొందుతోంది. తీర ప్రాంత పరిరక్షణ, స్థానిక అభివృద్ధి రెండింటి మధ్య సమతుల్యత అవసరమని ఈ వివాదం మరోసారి గుర్తుచేస్తోంది.

**• ఎల్ఆర్ఎస్‌పై ఆమంచి లేవనెత్తిన ప్రశ్నలు**

చీరాల భూవ్యవహారంలో ఆమంచి ప్రధానంగా ప్రస్తావించిన మరో అంశం ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్, ఎల్ఆర్ఎస్. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లేఔట్లను కేవలం ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఉందనే కారణంతో చట్టబద్ధమైనవిగా పరిగణించకూడదని ఆయన వాదిస్తున్నారు. ఆయన ఫిర్యాదులో 30 జూన్ 2025ను కటాఫ్ తేదీగా ప్రస్తావిస్తూ, ఆ తేదీకి ముందు సంబంధిత లేఔట్ ఉనికిలో ఉందా, కనీసం ఒక ప్లాట్ రిజిస్టర్ అయిందా, అవసరమైన పత్రాలు సమర్పించారా, సంబంధిత సంస్థల నుంచి అనుమతులు పొందారా, రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఏ దశలో ఉందో పరిశీలించాలని కోరారు. ఇదే సమయంలో కటాఫ్ తేదీ తర్వాత కూడా కొత్తగా ప్లాట్లు అభివృద్ధి చేసి విక్రయిస్తే వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి వినియోగ మార్పు, మాస్టర్ ప్లాన్, జోనింగ్, రోడ్ల వెడల్పు, ఓపెన్ స్పేస్, అమెనిటీలు, యుటిలిటీలు వంటి అంశాలను కూడా పరిశీలించాలని కోరారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ, ఒంగోలు అర్బన్ దవలప్మెంట్ అథారిటీ అధికారులు కలిసి సర్వే నంబర్ల వారీగా తనిఖీ చేయాలని ఆమంచి కోరారు. ఆయన మరో ఆరోపణ కూడా చేశారు. కొన్ని లేఔట్లలో ఎకరానికి నిబంధనల ప్రకారం వదలాల్సిన స్థలాన్ని కూడా వదలకుండా మొత్తం భూమిని ప్లాట్లుగా మార్చే ప్రయత్నం చేశారన్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం రావడంతో పాటు భవిష్యత్తులో ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ అంశాలపై తుది నిర్ణయం రావాలంటే ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులను విడిగా పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఉండటం, తుది లేఔట్ అనుమతి పొందటం ఒకటే కాదన్న విషయాన్ని కూడా అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. దరఖాస్తు స్థితి, చెల్లింపులు, ఆమోదాలు, పెండింగ్ అంశాలు, రిజిస్ట్రేషన్ చరిత్ర అన్నీ బయటకు వస్తే అసలు పరిస్థితి ప్రజలకు అర్థమవుతుంది.

**• చివరికి రికార్డులే తుది తీర్పు**

చీరాల భూములపై ఆమంచి కృష్ణమోహన్ చేసిన ఆరోపణలు రాజకీయంగా వేడి పెంచినా, అసలు విషయం రాజకీయ వ్యాఖ్యలకంటే భిన్నంగా ఉంది. 398.04 ఎకరాల నిర్దిష్ట భూవివరాల నుంచి 1,200 ఎకరాల విస్తృత ఆరోపణ వరకు, రామాపురంలోని సుమారు 26 ఎకరాల ప్రభుత్వ భూమి నుంచి కొత్తపేటలోని సీఆర్‌జడ్ పరిధిలో ఉన్నట్లు పేర్కొన్న 22 ఎకరాల వరకు ఇప్పుడు అనేక ప్రశ్నలు అధికారుల ముందున్నాయి. ఏ భూమి ప్రభుత్వ భూమి? ఏ భూమి ప్రైవేట్ భూమి? ఏ సర్వే నంబర్‌కు లేఔట్ అనుమతి ఉంది? వ్యవసాయ భూమి వినియోగ మార్పు జరిగిందా? రిజిస్ట్రేషన్లు ఏ ఆధారంతో జరిగాయి? ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఏ స్థితిలో ఉన్నాయి? సీఆర్‌జడ్ నిబంధనలు వర్తించే భూముల్లో నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? ఇవన్నీ పత్రాల ఆధారంగా తేలాల్సిన ప్రశ్నలు. ఆమంచి తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని చెబుతున్న నేపథ్యంలో వాటిని సంబంధిత అధికారులకు సమర్పించడం, అధికారులు వాటిని పరిశీలించడం తదుపరి సహజ దశ. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారిక రికార్డులతో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**- ఎం. చంద్రశేఖర్,**
**చీఫ్ రిపోర్టర్**

**చీరాల రూ. 50 కోట్ల భూమిపై**
**వాలిన రాబందులు..**
**రికార్డుల వెనుక గుట్టేంటి?**
**రేపటి సంచికలో..**

రేపటి సంచికలో..









**• వెంచర్లతో పాటు చెత్త సమస్య**

చీరాల భూవ్యవహారాన్ని ప్రస్తావించిన ఆమంచి పట్టణంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ అంశాన్ని కూడా ముందుకు తెచ్చారు. రామాపురంలో ఉన్న ఈ యూనిట్ చీరాల పట్టణ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన మౌలిక సదుపాయమని ఆయన చెప్పారు. గతంలో సుమారు రూ.9 కోట్ల నిధులతో పరికరాలు ఏర్పాటు చేసి చెత్త నుంచి సంపద తయారు చేసే విధంగా యూనిట్‌ను అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. చీరాల మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణలో జాతీయ స్థాయి గుర్తింపు రావడంలో ఈ వ్యవస్థకు ప్రాధాన్యం ఉందని ఆయన పేర్కొన్నారు. ఐతే, ప్రస్తుతం ఆ యూనిట్ సక్రమంగా వినియోగంలో లేకపోవడం వల్ల చెత్తను గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆమంచి ఆరోపించారు. చెత్తను బయటకు తరలిస్తే రవాణా ఖర్చు, డీజిల్, ప్రాసెసింగ్ చార్జీలు, సిబ్బంది వ్యయం వంటి అదనపు భారాలు మున్సిపాలిటీపై పడతాయని ఆయన చెప్పారు. చివరికి ఆ ఖర్చు ప్రజలపై పరోక్షంగా పడే అవకాశం ఉందని ఆమంచి తెలిపారు. గతంలో ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచిన చీరాల మున్సిపాలిటీ ఇప్పుడు చెత్త నిర్వహణ కోసం మరో ప్రాంతంపై ఆధారపడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఈ అంశం భూముల వివాదానికి నేరుగా సంబంధం లేకపోయినా, రామాపురం ప్రాంతంలో ప్రభుత్వ ఆస్తుల వినియోగం, ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన మౌలిక వసతుల నిర్వహణపై మరో చర్చకు కారణమైంది. అదే సమావేశంలో తీర ప్రాంతంలో సీఆర్‌జడ్, నో డెవలప్‌మెంట్ జోన్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆమంచి ఆరోపించారు. కటారివారిపాలెం ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారని, అనుమతి పత్రాల్లో సర్వే నంబర్లను తప్పుగా చూపించారని ఆయన ఆరోపించారు. సంబంధిత నిర్మాణంపై జిల్లా కలెక్టర్ వివరణ ఇచ్చారని కూడా ఆమంచి పేర్కొన్నారు.

# మారిన జగన్ కేలిక్యులేషన్

## సీపీఐతో కొత్త కోయిలేషన్

## ఒంటరి పోరు.. ఉమ్మడి సమరం..!

- సీపీఐ నేతలతో జగన్ భేటీ..
- గుర్తుకొస్తున్న వైఎస్సార్ వ్యూహం..!
- తండ్రి బాటలో తనయుడి అడుగులు..!
- ఏపీ రాజకీయాల్లో కొత్త లెక్కలు..!





**వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని కేవలం ముఖ్యమంత్రిగా సాగిన ఐదేళ్ల కాలంతో కొలిస్తే.. అది ఆయన రాజకీయ చరిత్రకు అన్యాయం చేసినట్టే. ఆయన రాజకీయ జీవితం పదవితో మొదలై పదవితో ముగిసినది కాదు. ఇందిరాగాంధీ నుంచి రాజీవ్‌గాంధీ వరకు.. ఆ తర్వాత పీవీ నరసింహారావు, సీతారాం కేసరి, సోనియాగాంధీ నాయకత్వ దశల వరకు కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న అనేక రాజకీయ పరిణామాలను దగ్గరగా చూసిన నాయకుడు వైఎస్సార్. వాటిలో తనదైన ముద్ర వేసిన నేత. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితుల్లో ఇందిరాగాంధీ వైఎస్సార్‌ను ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు. ఆ తర్వాత పార్టీని క్షేత్రస్థాయిలో నిలబెట్టే ప్రయత్నం చేశారు. 1999లో చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టి 2004 వరకు ఆ పాత్ర పోషించారు. 2003లో సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల మధ్యకు వెళ్లారు. అయితే వైఎస్సార్ ప్రత్యేకత కేవలం పాదయాత్రలోనే లేదు. అధికారాన్ని ఎదిరించేందుకు అవసరమైన చోట ఇతర రాజకీయ శక్తులను కలుపుకోవడంలోనూ ఉంది. ప్రజా సమస్యను రాజకీయ అజెండాగా మార్చడంలో ఉంది. ప్రత్యర్థి బలాన్ని అంచనా వేసి, తన బలాన్ని పెంచుకోవడంలో ఉంది. ఒంటరిగా పోరాడే సామర్థ్యం ఉన్నప్పటికీ... అవసరమైనప్పుడు ఇతర శక్తులతో కలిసి నడిచే రాజకీయ చతురత ఆయనకు ఉండేది. రాజకీయాల్లో ప్రత్యర్థి ఎవరు అన్నదే కాదు.. ఎక్కడ ఎవరి బలం అవసరమన్నది కూడా ఆయన లెక్కలో భాగమే. అదే వైఎస్సార్ రాజకీయ శైలికి ప్రత్యేకత తీసుకొచ్చింది.**

### • ఒంటరి బాటలో జగన్.. కొత్త మలుపు ఇదేనా?

జగన్ రాజకీయ ప్రయాణాన్ని అక్కడి నుంచి చూస్తే.. తండ్రితో పోలిక కంటే భిన్నత్వమే ముందుగా కనిపిస్తుంది. వైఎస్సార్ కాంగ్రెస్ వ్యవస్థలోనే తన స్థానాన్ని సంపాదించుకుంటూ దశాబ్దాల పాటు ఎదిగారు. జగన్ మాత్రం కాంగ్రెస్ తన పట్ల అనుసరించిన వైఖరితో విభేదించిన తర్వాత స్వతంత్ర రాజకీయ వేదికను నిర్మించుకున్నారు. తండ్రి మరణం తర్వాత ఓదార్పు యాత్ర విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానంతో విభేదించడం.. ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడం.. స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగడం.. ఇవన్నీ జగన్ రాజకీయ స్వభావాన్ని నిర్దేశించిన పరిణామాలు. అక్కడి నుంచి ఆయన రాజకీయానికి ప్రధాన లక్షణం ఒక్కటే.. మన బలం మనదే. మిత్రపక్షాల కోసం వెతకడం కంటే.. సొంత ఓటు బ్యాంకు, సొంత కేడర్, సొంత నాయకత్వం, సొంత రాజకీయ కథనంపైనే ఆధారపడిన పద్ధతి. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదే ధోరణి. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పంథా. 2024 ఎన్నికల తర్వాత రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలినా పార్టీని వదిలిపెట్టకుండా.. కేడర్‌ను నిలబెట్టే ప్రయత్నం చేయడం కూడా అదే స్వభావానికి కొనసాగింపు. అందుకే ఇప్పుడు సీపీఐ నేతలు తాడేపల్లి నివాసానికి వెళ్లి జగన్‌తో భేటీ కావడం సాధారణ రాజకీయ సమావేశమా? లేక జగన్ రాజకీయ ప్రయాణంలో కొత్త అధ్యాయానికి నాందా? అన్న చర్చ మొదలైంది.

### • తండ్రి వ్యూహం.. కొడుకు దూకుడు.. కొత్త దారి

ఇక్కడే తండ్రి-కొడుకుల రాజకీయ స్వభావాల మధ్య అసలు తేడా కనిపిస్తుంది. వైఎస్సార్ రాజకీయాల్లో ఓర్పు అంటే ఎదురుచూడటం కాదు.. సరైన సమయం కోసం పోరాటాన్ని పదును పెట్టడం. నేర్పు అంటే ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాదు.. ప్రత్యర్థి బలాన్ని అర్థం చేసుకుని తన బలాన్ని పెంచుకోవడం. సహనం అంటే మౌనంగా ఉండటం కాదు.. అవసరమైన సందర్భం వచ్చే వరకు మాటను అదుపులో ఉంచడం. ఈ మూడు లక్షణాలు ఆయన రాజకీయ జీవితంలో కలిసిపోయాయి. మరోవైపు జగన్ కూడా తనదైన రీతిలో రాజకీయ సహనాన్ని ప్రదర్శించారు. అధికారాన్ని కోల్పోయిన వెంటనే ఇతర పార్టీల వైపు చూడలేదు. తన పార్టీనే నమ్ముకున్నారు. తన రాజకీయ బలాన్నే ఆధారంగా చేసుకున్నారు. పరాజయం ఎదురైనా రాజకీయ రంగం నుంచి తప్పుకోలేదు. ఈ విషయంలో తండ్రి-కొడుకుల మధ్య ఒక సామ్యం ఉంది. ఇద్దరూ ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత సులభంగా వెనక్కి తగ్గే స్వభావం కలిగిన వారు కాదు. అయితే తేడా కూడా అక్కడే ఉంది. వైఎస్సార్ తన పోరాటానికి అవసరమైనప్పుడు ఇతర శక్తులను జత చేసేవారు. జగన్ మాత్రం ఇంతకాలం తన పోరాటాన్ని ప్రధానంగా తన పార్టీ పరిధిలోనే నడిపారు.

### • జగన్ ఒంటరి పోరాటానికి సీపీఐ తోడా?

అందుకే ఇప్పుడు సీపీఐ నేతలతో భేటీకి రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. సీపీఐ నేతలు జగన్‌తో ప్రజా సమస్యలపై చర్చించారు. కరువు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఓటర్ల జాబితా, డీఎస్సీ వంటి అంశాలపై కలిసి పోరాడాలని ప్రతిపాదించారు. సెప్టెంబరు 26న విజయవాడలో కరవు పరిస్థితులపై నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి వైఎస్సార్‌సీపీని ఆహ్వానించారు. జగన్ కూడా సానుకూలంగా స్పందించినట్లు సీపీఐ నేతలు వెల్లడించారు. ఇక్కడ గమనించాల్సింది 'పొత్తు' అనే పదం కాదు.. 'ప్రజా పోరాటం' అనే పదం. ఇప్పటి వరకు జగన్ రాజకీయంలో ఇతర పార్టీలతో సంబంధాల చర్చ ప్రధానంగా ఎన్నికల సమీకరణాల చుట్టూనే తిరిగేది. ఇప్పుడు ఎన్నికల బయట ప్రజా సమస్యలపై మరో రాజకీయ పార్టీతో కలిసి కదిలే అవకాశం కనిపిస్తోంది. అదీ వైఎస్సార్‌సీపీకి భిన్నమైన రాజకీయ సిద్ధాంతం కలిగిన వామపక్ష పార్టీతో. అందుకే ఈ భేటీకి రాజకీయ బరువు వచ్చింది. అయితే ఒక్క సమావేశంతో కొత్త కూటమి ఏర్పడిందని చెప్పడం తొందరపాటు. ఒక్క ఆహ్వానంతో పొత్తు ఖరారైందని అనుకోవడం కూడా అంతే తొందరపాటు. కానీ జగన్ రాజకీయ పంథాలో ఇంతవరకు పెద్దగా కనిపించని ఒక కొత్త కోణం మాత్రం బయటకు వచ్చింది. అదే.. ఒంటరి పోరాటం నుంచి ఉమ్మడి ఉద్యమం వైపు అడుగులు పడుతున్నాయా? అన్న ప్రశ్న.

### • సీపీఐతో జగన్ అడుగులు.. బీజేపీకి కొత్త లెక్కలు

ఇక్కడ బీజేపీ అంశం కూడా రాజకీయ చర్చలోకి వస్తోంది. సీపీఐ, బీజేపీల మధ్య సైద్ధాంతిక విభేదాలు బహిరంగమే. అలాంటి నేపథ్యంలో సీపీఐతో జగన్ ప్రజా సమస్యలపై కలిసి కదలడం సహజంగానే చర్చకు దారితీస్తుంది. అయితే ఇక్కడ ఒక తేడాను స్పష్టంగా గుర్తించాలి. కరువు, రైతు సమస్యలు, ఓటర్ల జాబితా, డీఎస్సీ వంటి నిర్దిష్ట అంశాలపై కలిసి పోరాడటం ఒకటి.. ఎన్నికల కూటమి లేదా జాతీయ రాజకీయ సమీకరణంలో భాగస్వామ్యం కావడం మరోటి. ప్రస్తుతానికి బయటకు వచ్చిన పరిణామాలు మొదటి అంశానికే పరిమితంగా కనిపిస్తున్నాయి. కాబట్టి ఈ భేటీని వెంటనే ఏదో ఒక రాజకీయ శిబిరంలో జగన్ చేరినట్లుగా అర్థం చేసుకోవడం కంటే.. ప్రజా సమస్యలపై ఇతర ప్రతిపక్ష శక్తులతో కలిసి కదిలే అవకాశాన్ని ఆయన పరిశీలిస్తున్నారా? అన్న కోణంలో చూడటం సముచితం. రాజకీయాల్లో మాటకన్నా తదుపరి అడుగు ముఖ్యం. సమావేశాల్లో పాల్గొంటారా? సంయుక్త కార్యక్రమాలు నిర్వహిస్తారా? ప్రజా సమస్యలపై కలిసి పోరాటం చేస్తారా? స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఏమైనా సమన్వయం ఉంటుందా? ఇవే ఈ భేటీ అసలు పరిమాణాన్ని నిర్ణయించబోతున్నాయి. ఇక విజయసాయిరెడ్డి వ్యాఖ్య ఈ రాజకీయ కథకు మరో పొరను జోడించింది. ఒకప్పుడు జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆయన ఇప్పుడు జగన్‌కు రాజకీయంగా దూరంగా ఉన్నారు. అందువల్ల జగన్-సీపీఐ భేటీపై ఆయన చేసిన వ్యాఖ్యను కేవలం ఒక రాజకీయ విమర్శగా మాత్రమే చూడలేం. తన కొత్త రాజకీయ స్థానం నుంచి జగన్ రాజకీయ పంథాపై ప్రత్యామ్నాయ వ్యాఖ్యానం చేసే ప్రయత్నంగానూ చూడవచ్చు. సీపీఐ నేతల భేటీపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే రాజకీయ చర్చకు దారితీశాయి. అయితే అది ఆయన రాజకీయ అభిప్రాయం. దాన్ని వాస్తవ నిర్ధారణగా చూడాల్సిన అవసరం లేదు. రాజకీయంగా దూరమైన నేత నుంచి వచ్చిన వ్యాఖ్యగా దాని నేపథ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అసలు ప్రశ్న మాత్రం విజయసాయిరెడ్డి వ్యాఖ్య కాదు.. జగన్ తీసుకునే తదుపరి అడుగే కీలకం.

### • వైఎస్సార్ దారి.. జగన్ రాజకీయంలో కొత్త మలుపు

వైఎస్సార్-జగన్ పోలికలో మరో కీలక అంశం ఉంది. వైఎస్సార్‌కు ప్రజల మధ్య ఉండటం రాజకీయానికి ఇంధనం అయితే.. జగన్‌కు తనపై ఉన్న ప్రజా మద్దతును రాజకీయ మూలధనంగా నిలుపుకోవడం ప్రధాన వ్యూహంగా కనిపించింది. వైఎస్సార్ పాదయాత్రకు వెళ్లినప్పుడు పార్టీ యంత్రాంగాన్ని మించి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని నిర్మించారు. జగన్ కూడా పాదయాత్ర చేశారు. కానీ ఇద్దరి పాదయాత్రల రాజకీయ సందర్భాలు వేరు. వైఎస్సార్ పాదయాత్ర కాంగ్రెస్ పునరుజ్జీవనానికి, చంద్రబాబు ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ రాజకీయ వాతావరణ నిర్మాణానికి ఉపయోగపడింది. జగన్ పాదయాత్ర మాత్రం ఇప్పటికే నిర్మించుకున్న వైఎస్సార్ వారసత్వం, ఓదార్పు యాత్ర, కాంగ్రెస్‌తో విభేదం, వైఎస్సార్‌సీపీ నిర్మాణం వంటి పరిణామాల తర్వాత సాగింది. ఇద్దరి ప్రయాణాల్లో ప్రజలే కేంద్ర బిందువు అయినప్పటికీ.. ప్రజలతో రాజకీయ సంబంధాన్ని నిర్మించుకున్న పద్ధతిలో తేడా ఉంది. వైఎస్సార్ ప్రత్యర్థి శిబిరాల్లోని శక్తులతోనూ అవసరమైనప్పుడు రాజకీయ అవగాహనకు స్థలం కల్పించేవారు. జగన్ మాత్రం తన రాజకీయ స్వాతంత్ర్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే ఇప్పుడు సీపీఐతో కలిసి ప్రజా పోరాటం అనే ఆలోచన ముందుకు రావడం కేవలం ఒక సమావేశం కాదు.. జగన్ ఇప్పటివరకు అనుసరించిన రాజకీయ పద్ధతిలో మార్పు సంభవిస్తుందా? అన్న చర్చకు కారణమైంది.

### • జగన్ ముందున్న అసలు పరీక్ష.. పోరాటమేనా?

జగన్ ముందు ఇప్పుడు అసలు పరీక్ష ఇదే. సీపీఐతో ఒక వేదికపై కూర్చోవడమా? లేక సీపీఐతో కలిసి ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాన్ని నిర్మించడమా? రెండింటికీ చాలా తేడా ఉంది. మొదటిది ఒక రాజకీయ సంఘటన. రెండోది ఒక రాజకీయ ప్రక్రియ. వైఎస్సార్ బలం ఈ ప్రక్రియలోనే కనిపించింది. సమస్యను గుర్తించడం నుంచి ప్రజలను సమీకరించడం వరకు.. ప్రజా ఉద్యమం నుంచి రాజకీయ ప్రత్యామ్నాయం నిర్మించడం వరకు ఆయనకు ఒక నిరంతర వ్యూహం ఉండేది. జగన్ కూడా ఇప్పుడు ప్రజా సమస్యలను దీర్ఘకాలిక రాజకీయ అజెండాగా మార్చగలరా అన్నదే చూడాల్సిన అంశం. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రతిపక్ష ధర్మంలో ఒక భాగం. కానీ ప్రజల సమస్యను పట్టుకుని.. దానిపై ప్రజలను సమీకరించి.. అవసరమైనప్పుడు వివిధ రాజకీయ శక్తులను ఒకే వేదికపైకి తీసుకురావడం మరో స్థాయి రాజకీయ పని. ఆ దిశగా జగన్ అడుగులు వేస్తారా? లేక ఈ భేటీ ఒకే సందర్భానికి పరిమితమవుతుందా? అన్నది కాలమే తేల్చాలి. ఇదంతా చూస్తే తండ్రి-కొడుకుల మధ్య ఒక ఆసక్తికరమైన రాజకీయ సంభాషణ కనిపిస్తుంది. వైఎస్సార్ రాజకీయ పాఠం ప్రకారం చూస్తే.. ఒంటరిగా బలంగా ఉండు.. అవసరమైనప్పుడు బలాలను కలుపుకో. ఇక జగన్ ఇప్పటివరకు అనుసరించిన పంథా మాత్రం ఎవరినీ ఆశ్రయించకు.. నీ బలం మీదే నిలబడు. అయితే ఇప్పుడు సీపీఐ భేటీ ఈ రెండు పద్ధతుల మధ్య ఒక వంతెనలా కనిపిస్తోంది. అది శాశ్వత వంతెన అవుతుందా? తాత్కాలిక రాజకీయ దారిగా మిగులుతుందా? లేక ప్రజా సమస్యలపై విస్తృత సమన్వయానికి దారితీస్తుందా? సమాధానం ఇప్పుడే చెప్పలేం. కానీ జగన్ రాజకీయ ప్రయాణంలో 'ఒంటరి పోరాటం' అనే ముద్ర పక్కన 'ప్రజా సమస్యలపై పరస్పర సహకారం' అనే కొత్త అధ్యాయం చేరే అవకాశం మాత్రం ఈ పరిణామం కల్పించింది.

### • తాడేపల్లి తలుపు తెరిచింది.. దారి ఎటువైపు?

చివరికి వైఎస్సార్ రాజకీయాన్ని గుర్తు చేసుకోవాల్సింది ఆయన కుమారుడిని తండ్రితో తూకం వేయడానికే కాదు. ఇద్దరి కాలాలు వేరు. ఇద్దరి రాజకీయ పరిస్థితులు వేరు. ఇద్దరి ప్రత్యర్థులు వేరు. ఇద్దరి వ్యూహాలు కూడా వేరు. అయినా ఒక సామ్యం మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. సులభంగా వెనక్కి తగ్గని పట్టుదల. వైఎస్సార్ ఆ పట్టుదలను ప్రజా ఉద్యమాలుగా మలిచారు. జగన్ దాన్ని పార్టీ స్వాతంత్ర్యంగా మలిచారు. ఇప్పుడు అదే పట్టుదలకు కొత్త దిశ ఇవ్వాల్సిన సందర్భం జగన్ ముందుంది. ప్రజా పోరాటం అంటే మైక్ ముందు మాటలు కాదు. ప్రజల మధ్య నడక కావాలి. సమస్యపై నిరంతర శ్రమ కావాలి. అవసరమైనప్పుడు రాజకీయ గోడలు దాటి చేతులు కలపగల నేర్పు కావాలి. తండ్రి నుంచి వచ్చిన ఓర్పు.. తన రాజకీయ ప్రయాణంలో సంపాదించిన సహనం.. స్వతంత్ర నిర్ణయాలపై ఉన్న పట్టుదల.. ఈ మూడింటినీ ఒకే దారిలో నడిపితేనే తాడేపల్లిలో జరిగిన సీపీఐ భేటీకి దీర్ఘకాలిక రాజకీయ అర్థం వస్తుంది. లేదంటే అది మరో రాజకీయ సమావేశంగానే మిగిలిపోతుంది. రాజకీయ చరిత్రలో తలుపులు తట్టేవారు చాలామంది ఉంటారు. కానీ ఆ తలుపు తెరిచి ఎటువైపు నడవాలో నిర్ణయించేది మాత్రం ఆ ఇంటి నాయకుడే.

.. ✍
ఎడిటర్





### • కాలం మారినా వైఎ... శ్వతం

అయితే వైఎస్సార్ రాజకీయాన్ని జగన్ యథాతథంగా అనుసరించాల్సిన అవసరం లేదు. కాలం మారింది. రాజకీయ సమీకరణాలు మారాయి. అప్పటి కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాల మధ్య ఉన్న సంబంధాలు వేరు. ఇప్పుడు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఒకవైపు ఉండగా.. వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, వామపక్షాలు తమ తమ రాజకీయ స్థలాల్లో ఉన్నాయి. సోషల్ మీడియా రాజకీయాన్ని పూర్తిగా మార్చేసింది. ఒకప్పుడు పాదయాత్రలో చెప్పిన మాట గ్రామం నుంచి గ్రామానికి చేరడానికి రోజులు పట్టేది. ఇప్పుడు అదే మాట నిమిషాల్లో లక్షల మందికి చేరుతోంది. కాబట్టి వైఎస్సార్ కాలంలో పనిచేసిన ప్రతి వ్యూహం జగన్ కాలంలో కూడా అదే ఫలితాన్ని ఇస్తుందని అనుకోవడం సరికాదు. కానీ వైఎస్సార్ నుంచి నేర్చుకోదగిన ఒక రాజకీయ పాఠం మాత్రం కాలాతీతం. ప్రజా సమస్యను కేవలం ప్రభుత్వ వ్యతిరేక నినాదంగా కాకుండా.. ప్రజల జీవన సమస్యగా మలచడం. కరువు అంటే ఒక గణాంకం కాదు.. నీరు లేక ఎండిపోయే రైతు పొలం. డీఎస్సీ వివాదం అంటే ఒక రాజకీయ ఆరోపణ కాదు.. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న యువకుడి భవిష్యత్తు. ఓటర్ల జాబితా అంటే కాగితాల వ్యవహారం కాదు.. ఓటరుకు తన ఓటు హక్కుపై ఉన్న నమ్మకం. ఈ భాషలో ప్రజా పోరాటం సాగితేనే అది రాజకీయ ప్రచారాన్ని దాటి ప్రజా ఉద్యమంగా మారుతుంది.

# తప్పుల తడకగా ఫామ్ సిక్స్

## తప్పించుకోలేక సీఈసీ ఫిక్స్

**ఫామ్-6లో చిన్న మార్పు.. పెద్ద వివాదం**

**తెర వెనుక కథ నడిపించిందెవరు?**

**ఓటు హక్కుపై కొత్త ప్రశ్నలు**

“ భారత ఎన్నికల వ్యవస్థలో ఓటరు నమోదు ప్రక్రియకు ఫామ్-6 అత్యంత కీలకమైన పత్రం. తొలిసారి ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తి ఈ ఫారాన్ని సమర్పించాలి. వయసు, పౌరసత్వం, సాధారణ నివాసం వంటి అర్హతలను పరిశీలించే ఈ ప్రక్రియలో 2026 జూలైలో చేసిన ఒక మార్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ, న్యాయ చర్చకు దారి తీసింది. ఎన్నికల సంఘం ఈసీఐనెట్ పోర్టల్‌లోని ఫామ్-6 లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు (సర్) సంబంధించిన కొత్త ప్రశ్నను చేర్చింది. దరఖాస్తుదారు తన పేరు గత సర్ సమయంలోని ఓటర్ల జాబితాలో ఉందా, లేక తల్లిదండ్రులు లేదా తాతలు, నానమ్మల పేర్లు ఆ జాబితాలో ఉన్నాయా, లేక తన కుటుంబంలో ఎవరి పేరు కూడా లేదో చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రశ్నను ఫార్మ్‌లో తప్పనిసరి అని ప్రత్యేకంగా గుర్తించకపోయినా, సమాధానం ఇవ్వకుండా ఆన్‌లైన్ దరఖాస్తును ముందుకు తీసుకెళ్లే అవకాశం లేకపోయిందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక పేర్కొంది. ఇక్కడే అసలు వివాదం మొదలైంది. ఫామ్-6 లో ఈ మార్పు చేయడానికి ఎన్నికల సంఘానికి స్వతంత్ర అధికారముందా? లేక 1960 నాటి రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోర్స్ రూల్స్‌లో అధికారిక సవరణ అవసరమా? ఇదే ప్రశ్నను ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్ సింగ్ సంధు అధికారిక రికార్డుల్లో లేవనెత్తారు. మే 16న జోషి ఫామ్-6 చట్టబద్ధమైన ఫారం కాబట్టి నిబంధనలు మార్చకుండా దానిలో మార్పు చేయలేమని పేర్కొన్నట్లు నివేదిక తెలిపింది. మే 19న సంధు కూడా అదే అభిప్రాయంతో ఏకీభవించారు. అయినా జూలైలో మార్పు అమల్లోకి వచ్చింది. ఆగస్టు 13న సంధు మరోసారి ఈ మార్పును “అనధికారికం, చట్టవిరుద్ధం”గా పేర్కొని వెంటనే తొలగించాలని కోరినట్లు నివేదిక వెల్లడించింది.






### ఫామ్-6లో అసలు ఏం మార్చారు?

ఈ మార్పు వెనుక ఉన్న అసలు అంశాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా సర్ ప్రక్రియను చూడాలి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో పాత ఓటర్ల జాబితాలను ప్రస్తుత వివరాలతో సరిపోల్చి అర్హులైన ఓటర్లను కొనసాగించడం, మరణించినవారు, శాశ్వతంగా మారిపోయినవారు, డూప్లికేట్ పేర్లు వంటి వాటిని తొలగించడం లక్ష్యంగా ఎన్నికల సంఘం చెబుతోంది. అయితే ఈ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించబడటం వివాదానికి కారణమైంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ముసాయిదా జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడ్డాయి. ఈ తొలగింపులన్నీ తుది ఓటు హక్కు రద్దు అని అర్థం కాదు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, పునఃపరిశీలనకు అవకాశాలు ఉన్నాయి. అయినా ఒక కుటుంబానికి చెందిన పాత ఓటరు పేరు తొలగిపోయిన తర్వాత అదే కుటుంబంలో కొత్తగా 18 ఏళ్లు నిండిన వ్యక్తి ఫామ్ 6 ద్వారా నమోదు కావాలంటే గత సర్‌లో కుటుంబ సంబంధాన్ని నిరూపించాల్సిన పరిస్థితి వస్తుందా అన్న ప్రశ్న తలెత్తింది. ఒక యువ ఓటరుకు ఓటు హక్కు అతని వ్యక్తిగత అర్హతల ఆధారంగా నిర్ణయించాలా, లేక తల్లిదండ్రులు, తాతలు పాత ఓటర్ల జాబితాలో ఉన్నారో లేదో కూడా ప్రమాణంగా మారాలా? ఇదే విమర్శకు కేంద్ర బిందువు. నివేదిక ప్రకారం కొత్త ఫామ్ 6 లో దరఖాస్తుదారు మూడు ఎంపికల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి. తన పేరు పాత సర్ జాబితాలో ఉందని, తల్లిదండ్రులు లేదా తాతలు, నానమ్మల పేరు ఉందని, లేక ఆ కుటుంబంలో ఎవరి పేరు కూడా లేదని పేర్కొనాలి. కుటుంబం గతంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి మారిపోయి ఉంటే, పాత పత్రాలు లేకపోతే, తల్లిదండ్రుల పేర్లు వేర్వేరు విధంగా నమోదై ఉంటే సమస్యలు రావచ్చన్న ఆందోళన వ్యక్తమైంది.

### ఇది ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే కుట్రా?

ఇక్కడే రాజకీయ ఆరోపణలు అత్యంత తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల వాదన ఏమిటంటే, ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించి, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో అదనపు అడ్డంకులు పెడితే కొన్ని వర్గాల ఓటు హక్కు ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. ఆ ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడవచ్చని వారు అంటున్నారు. ముఖ్యంగా సర్‌లో పేర్లు తొలగించిన కుటుంబాల పిల్లలు కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి పాత సర్‌తో కుటుంబ సంబంధం చూపించాల్సి వస్తే, ముందు తరంలో నమోదైన లోపం తరువాతి తరపు ఓటు హక్కుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నది విమర్శకుల వాదన. మరోవైపు ఎన్నికల సంఘం ఉద్దేశం అర్హత లేని పేర్లను తొలగించడం, ఓటర్ల జాబితాను శుద్ధి చేయడమేనని చెబుతోంది. ఇక్కడ “ప్రతిపక్షాలను ఓడించడానికి పథకం” అనే ఆరోపణను నిర్ధారిత వాస్తవంగా చెప్పడం సాధ్యం కాదు. అయితే ఒక రాజకీయ పార్టీకి లాభం కలిగేలా ఓటర్ల జాబితా మార్పులు జరిగాయా అనే ప్రశ్నకు సమాధానం కనుగొనాలంటే ప్రతి నియోజకవర్గ స్థాయిలో డేటాను పరిశీలించాలి. ఎవరి పేర్లు తొలగించారు? వారి రాజకీయ నేపథ్యం ఏమిటి? తొలగింపుల కారణాలు ఏమిటి? అప్పీల్ చేసిన వారిలో ఎంతమంది తిరిగి చేర్చారు? కొత్తగా నమోదైన ఓటర్లలో ఎన్ని దరఖాస్తులు తిరస్కరించారు? ఇవన్నీ రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, బూత్ స్థాయిలో విడివిడిగా పరిశీలించాలి. ఒకే పార్టీకి చెందిన ఓటర్ల పేర్లు అసాధారణంగా ఎక్కువగా తొలగించారని గణాంకపరంగా నిర్ధారణ అయితే అది తీవ్రమైన ప్రశ్న అవుతుంది. కానీ అటువంటి విశ్లేషణ లేకుండా “గెలిచేవారిని ఓడేలా చేశారు, ఓడేవారిని గెలిపించారు” అని తేల్చడం ఆధారరహితంగా మారుతుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక మాత్రం ఓటర్ల డేటాబేస్ యాక్సెస్ క్రమంగా కేంద్ర స్థాయిలో కేంద్రీకృతమవుతోందన్న ఇద్దరు కమిషనర్ల ఆందోళనను ప్రస్తావించింది. ఎన్నికల డేటాను ఎవరు మార్చగలరు? ఎవరి అనుమతితో మార్చగలరు? ప్రతి మార్పుకు డిజిటల్ రికార్డు ఉందా? అనే ప్రశ్నలు మాత్రం స్వతంత్ర పరిశీలనలో తేలాల్సి ఉంది.

### ఒక్కో నిర్ణయం వెనుక మిస్టరీ

ఫామ్ 6 వివాదం ఒక్కటే కాదు. అదే కాలంలో ఓటర్ల డేటాబేస్ ప్రాప్యత, సాఫ్ట్‌వేర్ నియంత్రణ, సర్లో తొలగించిన ఓటర్ల పునరుద్ధరణ, తిరిగి చేర్చిన ఓటర్లపై అప్పీళ్లు వంటి అంశాలపై కూడా కమిషనర్లు ప్రశ్నలు లేవనెత్తినట్లు నివేదిక చెబుతోంది. ముఖ్యంగా కేంద్ర సాఫ్ట్‌వేర్ వ్యవస్థ స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్స్ నిర్ణయాలపై ప్రభావం చూపుతోందా? అన్న ప్రశ్న ప్రాధాన్యం పొందింది. భారత ఎన్నికల వ్యవస్థలో ఓటర్ల జాబితా నిర్వహణకు స్థానిక స్థాయిలో చట్టబద్ధ అధికారుల పాత్ర ఉంది. వారు పరిశీలించి అర్హతను నిర్ధారించిన తర్వాత డేటా వ్యవస్థలో మార్పులు నమోదు కావాలి. కానీ కేంద్రస్థాయి డిజిటల్ వ్యవస్థ ఒక నిర్ణయాన్ని అడ్డుకుంటే, స్థానిక అధికారి నిర్ణయం ఎంతవరకు అమలవుతుందన్నది కీలకమైన ప్రశ్న. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మరో నివేదికలో గోవాలో 97 మంది ఓటర్లను ఓటు వేయడానికి అర్హులుగా నిర్ధారించినప్పటికీ, సాఫ్ట్‌వేర్ సంబంధిత సమస్య కారణంగా తుది జాబితాలో వారి పేర్లు ప్రతిబింబించలేదని పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో 16.10 లక్షలకు పైగా అప్పీళ్లు ఒకే అధికారి లాగిన్ ద్వారా దాఖలైన అంశంపైనా ప్రశ్నలు లేవనెత్తినట్లు నివేదిక తెలిపింది. ఇవి ఉద్దేశపూర్వక ఎన్నికల మోసానికి కారణం కాదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. కానీ ఎన్నికల డేటాను మార్చే వ్యవస్థలో మానవ పర్యవేక్షణ, అనుమతి విధానం, ఆడిట్ ట్రయల్, బాధ్యత నిర్ధారణ ఎంత బలంగా ఉందో తెలుసుకోవాల్సిన అవసరాన్ని మాత్రం చూపిస్తున్నాయి. ఫామ్ 6 మార్పు కూడా ఇదే పెద్ద చిత్రంలో భాగంగా చూడాలి. ఒక చిన్న ఫామ్‌లో ఒక ప్రశ్న చేర్చడం సాంకేతిక మార్పులా కనిపించవచ్చు. కానీ ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వకపోతే దరఖాస్తు ముందుకు వెళ్లకపోతే, అది కొత్త ఓటరు నమోదు ప్రక్రియలో వాస్తవ అడ్డంకిగా మారుతుంది. ప్రత్యేకంగా పాత సర్‌లో కుటుంబ వివరాలు లేకపోయిన యువతపై దాని ప్రభావం ఎంత ఉంటుందో డేటాతో పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడే “కుట్ర” అనే రాజకీయ పదం కంటే “ప్రక్రియలో ఎక్కడ నియంత్రణ ఉంది?” అనే బిగ్ కొశ్చన్ విన్పిస్తోంది.

### ఫామ్-6 వివాదానికి తుది పరీక్ష ఇదే

ఈ వ్యవహారంలో అసలు నిజం బయటపడాలంటే ఆరోపణలు, రాజకీయ ప్రసంగాలు సరిపోవు. ఫైళ్లు బయటకు రావాలి. నిర్ణయాల కాలక్రమం బయటపడాలి. ఎవరు ప్రతిపాదించారు... ఎవరు అభ్యంతరం చెప్పారు... ఎవరు ఆమోదించారన్నది స్పష్టంగా తెలియాలి. ఫామ్ 6 లో మార్పు చేయడానికి చట్టబద్ధ అధికారముందా లేదా అనే ప్రశ్నకు సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ నోటిఫికేషన్లు, ఎన్నికల సంఘం ఆదేశాలు ఆధారంగా సమాధానం ఇవ్వాలి. ఇద్దరు కమిషనర్లు మేలో అభ్యంతరం చెప్పిన తర్వాత కూడా జూలైలో మార్పు ఎందుకు అమల్లోకి వచ్చిందో పూర్తి ఫైల్ నోటింగ్స్ ద్వారా పరిశీలించాలి. ఆగస్టులో సంధు మార్పును తొలగించాలని కోరిన తర్వాత అది ఎంతకాలం పోర్టల్‌లో కొనసాగిందో కూడా నిర్ధారించాలి. సర్‌లో తొలగించిన ప్రతి పేరుకు కారణం డిజిటల్‌గా నమోదు కావాలి. తిరిగి చేర్చిన ప్రతి పేరుకు కూడా కారణం ఉండాలి. ఒక ఓటరు పేరు తొలగించే అధికారం ఎవరిది? ఒక పేరు తిరిగి చేర్చే అధికారం ఎవరిది? సాఫ్ట్‌వేర్ నిర్ణయాన్ని ఎవరు మార్చగలరు? ఆ మార్పును ఎవరు పర్యవేక్షిస్తారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకుండా ఎన్నికల వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం సాధ్యం కాదు. అదే సమయంలో, సీఈసీ ఒక పార్టీకి అనుకూలంగా ఉద్దేశపూర్వకంగా పనిచేశాడని నిర్ధారించాలంటే రాజకీయ అనుమానాల కంటే బలమైన ఆధారాలు అవసరం. నియోజకవర్గాల వారీగా ఓటర్ల తొలగింపులు, కొత్త నమోదులు, తిరస్కరణలు, అప్పీళ్లు, పునరుద్ధరణలు, ఎన్నికల ఫలితాల మధ్య సంబంధాన్ని స్వతంత్ర నిపుణులతో విశ్లేషించాలి. దేశ ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలంటే వ్యక్తులను మాత్రమే కాదు, వ్యవస్థను ఆడిట్ చేయాలి. ఫామ్ 6 మార్పు చట్టబద్ధమా కాదా, సర్‌లో ప్రక్రియ సక్రమంగా జరిగిందా, డేటాబేస్ నియంత్రణ పారదర్శకమా, కమిషనర్ల అభ్యంతరాలకు సముచిత పరిష్కారం ఇచ్చారా అన్నదే ఇప్పుడు అసలు పరీక్ష. ఆ పరీక్షలో ఆధారాలు ఏం చెబుతాయో అదే తుది సమాధానం కావాలి. రాజకీయ ఆరోపణలు ఒక వైపు, అధికారిక రికార్డులు మరో వైపు నిలిచిన ఈ దశలో ఓటు హక్కు కాపాడటం, ఎన్నికల సంఘంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం, ప్రతి నిర్ణయాన్ని పారదర్శకంగా పరిశీలించగల వ్యవస్థను ఏర్పాటు చేయడం దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన అవసరం.



### కమిషనర్లు ఎందుకు తిరుగుబాటు స్వరం వినిపించారు?

ప్రస్తుత వివాదంలో అత్యంత సంచలన అంశం ఫామ్ 6 మార్పు మాత్రమే కాదు. ఎన్నికల కమిషన్‌లోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు ఒకే నిర్ణయంపై అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేయడం ఈ వ్యవహారానికి అసాధారణ ప్రాధాన్యం తెచ్చింది. నివేదిక ప్రకారం గత పది నెలల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలు లేదా జారీ చేసిన ఆదేశాలపై రికార్డుల్లో అభ్యంతరాలు నమోదు చేశారు. కొన్ని నిర్ణయాలు తమకు ముందస్తు సమాచారం లేకుండా తీసుకున్నాయని వారు పేర్కొన్నట్లు కథనం తెలిపింది. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, తిరిగి చేర్పు, సర్‌లో పునరుద్ధరించిన ఓటర్లపై అప్పీళ్లు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో “సీఈసీపై కమిషనర్లు తిరుగుబాటు చేశారా?” అన్న రాజకీయ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే అధికారికంగా చూస్తే అది తిరుగుబాటు కంటే అంతర్గత భిన్నాభిప్రాయాలు, లిఖితపూర్వక అభ్యంతరాలుగా పేర్కొనడం సరైనది. జోషి ఫామ్ 6 మార్పును చట్టబద్ధంగా అమలు చేయాలంటే ప్రభుత్వ స్థాయిలో సంబంధిత నిబంధనలను సవరించాలని సూచించారు. సంధు కూడా ఆ అభిప్రాయాన్ని సమర్థించారు. మార్పు అమల్లోకి వచ్చిన తర్వాత కూడా సంధు దానిని తొలగించాలని కోరారు. ఇదే సమయంలో ఎన్నికల సంఘం స్పందిస్తూ భిన్న అభిప్రాయాలు సంస్థాగత నిర్ణయ ప్రక్రియలో సాధారణ భాగమేనని తెలిపింది. గత ఏడాది పూర్తి కమిషన్ తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని కూడా స్పష్టం చేసింది. అంటే రెండు వేర్వేరు విషయాలను విడదీయాలి. ఒకటి.. ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు నమోదు చేశారన్న విషయం. రెండోది.. ఆ అభ్యంతరాల వల్ల సీఈసీ ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని ఉల్లంఘించాడని నిర్ధారణ కావడం. మొదటి విషయం రికార్డుల్లో కనిపిస్తోంది. రెండో విషయానికి మాత్రం స్వతంత్ర దర్యాప్తు లేదా న్యాయపరమైన నిర్ధారణ అవసరం.



# ప్రపంచకప్‌కు వెళ్లేముందు జాగ్రత్త

- పూర్తి ఫిట్ కండి.. సగం సగం వద్దు
- బుమ్రా.. హార్దిక్‌పై గంభీర్ వార్నింగ్

2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో అడుగులు వేయాలని హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా దక్షిణాఫ్రికా వేదికలపై భారత్ విజయానికి అత్యంత కీలకమని చెప్పిన గంభీర్.. ప్రపంచకప్‌కు సగం సిద్ధంగా వెళ్లే పరిస్థితి ఉండకూడదని తేల్చిచెప్పాడు. హార్దిక్ లాంటి ఆల్‌రౌండర్ జట్టుకు అరుదైన బలం అని, ఆరో నంబర్ లేదా ఏడో నంబర్‌లో బ్యాటింగ్‌తో పరుగులు చేయడంతో పాటు పది ఓవర్లు బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడి ప్రత్యేకత అని పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 తర్వాత పెద్దగా క్రికెట్ ఆడని హార్దిక్‌కు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ అవసరమని, టీ20ల నుంచి వన్డేలకు క్రమంగా తీసుకురావాల్సి ఉందని గంభీర్ తెలిపాడు. బుమ్రా విషయంలోనూ వన్డేలు, టెస్టులు, పనిభారాన్ని సమతుల్యం చేయడం కీలకమన్నాడు. ప్రపంచకప్‌కు ముందు కీలక ఆటగాళ్లు 11 మంది లేదా 15 మంది కలిసి ఎక్కువ మ్యాచ్‌లు ఆడితే జట్టు సమన్వయంతో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పాడు. మరోవైపు సంజూ శాంసన్‌ను ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లో తప్పించడం తన కోచింగ్ కాలంలో అత్యంత కఠిన నిర్ణయమని, ఆ రాత్రి నిద్రపోలేకపోయానని గంభీర్ వెల్లడించాడు. వైభవ్ సూర్యవంశీ అద్భుత ఫామ్‌లో ఉండటంతో తీసుకున్న ఆ నిర్ణయం వెనుక జట్టు విజయమే ప్రధాన కారణమని స్పష్టం చేశాడు. సోషల్ మీడియా శబ్దం కాదు.. జట్టును గెలిపించే అత్యుత్తమ కలయికే తుది నిర్ణయమని గంభీర్ సందేశం ఇచ్చాడు.






# నాగోయాలో భారత పతకాల జోరు!

- స్వర్ణం.. రజతం.. కాంస్యం..
- కబడ్డీలో ఫైనల్ ఫైట్

ఆసియా క్రీడలు-2026లో భారత్ పతకాల వేట జోరందుకుంది. నాగోయా వేదికగా శుక్రవారం భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో పతకాల పట్టికలో తమ జోరును కొనసాగించారు. మహిళల పోల్వాల్ట్‌లో తమిళనాడుకు చెందిన బరణిక ఎలంగోవన్ చరిత్ర సృష్టిస్తూ భారత్‌కు ఈ విభాగంలో తొలి పతకాన్ని అందించారు. 4.15 మీటర్ల ఎత్తును అధిగమించిన బరణిక.. కజకిస్థాన్‌కు చెందిన పోలినా ఇవనోవాతో కలిసి సంయుక్త కాంస్యం సాధించారు. ఇదే సమయంలో షూటింగ్‌లో సురుచి సింగ్-కమల్‌జీత్ జోడీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణంతో మెరిసింది. 484.6 పాయింట్లతో ఆసియా క్రీడల రికార్డును కూడా బద్దలు కొట్టడం ఈ విజయానికి మరింత మెరుపునిచ్చింది. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్ 28:29.38 నిమిషాలతో రజతం సాధించి తన గత కాంస్యాన్ని రజతంగా అప్‌గ్రేడ్ చేసుకున్నాడు. టేబుల్ టెన్నిస్‌లో మానుష్ షా-దియా చితాలే జోడీ హాంకాంగ్ జోడీని ఓడించి సెమీఫైనల్‌కు చేరడంతో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. స్క్వాష్‌లో జోష్నా చినప్ప, వెలవన్ సెంథిల్‌కుమార్, అనాహత్ సింగ్, అభయ్ సింగ్ కూడా పతకాల రేసులో దూసుకెళ్తున్నారు. మరోవైపు భారత మహిళల కబడ్డీ జట్టు నేపాల్‌ను 48-24తో, పురుషుల జట్టు థాయ్‌లాండ్‌ను 66-28తో చిత్తు చేసి ఫైనల్లోకి దూసుకెళ్లాయి. అయితే బ్యాడ్మింటన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్లు సాత్విక్-చిరాగ్ తొలి రౌండ్‌లోనే అనూహ్యంగా నిష్క్రమించడం నిరాశ కలిగించింది. మొత్తంగా స్వర్ణం, రజతం, కాంస్యాలతో భారత్ పతకాల పంచ్ కొనసాగుతోంది!









# ములానీ మాయాజాలం

- ఆసీస్ ఏపై భారత్ ఘన విజయం
- 162 పరుగుల తేడాతో విక్టరీ

పుదుచ్చేరి వేదికగా ఆస్ట్రేలియా 'ఎ'పై భారత్ 'ఎ' అదిరిపోయే విజయాన్ని నమోదు చేసింది. తొలి అనధికారిక టెస్టులో 162 పరుగుల తేడాతో గెలిచి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. నాలుగో రోజు భారత బౌలర్ల ధాటికి ఆసీస్ బ్యాటింగ్ కుప్పకూలింది. లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 55/2తో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 'ఎ'ను అన్షుల్ కాంబోజ్ ఆరంభంలోనే దెబ్బతీశాడు. నాథన్ మెక్‌స్వీనీ, పీటర్ హ్యాండ్స్‌కోంబ్‌లను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత తుషార్ దేశ్‌పాండే రివర్స్ స్వింగ్‌తో బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. భోజన విరామం తర్వాత కేవలం 6.1 ఓవర్లలో మిగిలిన మూడు వికెట్లను శామ్స్ ములానీ పడగొట్టి మ్యాచ్‌కు తెరదించాడు. ములానీ మ్యాచ్‌లో మొత్తం 7 వికెట్లు సాధించగా, దేశ్‌పాండే రెండో ఇన్నింగ్స్‌లో 3/14తో మెరిశాడు.

# విసిగించిన అనుమాన పక్షి

**నవ్వుల కోసం అలసిన ప్రయాణం!**

**కలగాపులగమైన కథ.. కుదరని కామెడీ..**



దర్శకుడు విమల్ కృష్ణ తన తొలి చిత్రం 'డీజే టిల్లు'తో అందుకున్న విజయాన్ని మరోసారి అందుకోవాలనే ప్రయత్నంలో తెరకెక్కించిన 'అనుమాన పక్షి' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అదే తరహా వింత స్వభావం, ప్రేమలో పడ్డ కథానాయకుడు, పక్కనే శవం పడటంతో మొదలయ్యే గందరగోళం ఈ సినిమాలోనూ కనిపిస్తాయి. యూట్యూబర్‌గా ఎదగాలని తపించే సన్నీ పాత్రలో రాగ్ మయూర్ ప్రతి విషయాన్నీ అనుమానించే వ్యక్తిగా కనిపిస్తాడు. తల్లిదండ్రులు చిన్న విషయానికే గొడవపడితే విడాకులు తీసుకుంటారేమోనని భయపడటం, స్నేహితుడు మసాజ్ పార్లర్ పెడితే దాని వెనుక ఏదైనా అక్రమ వ్యవహారం ఉందేమోనని పోలీసులకు చెప్పడం వంటి సన్నివేశాలతో అతడి అతిభయం పరిచయమవుతుంది. పాత స్నేహితుడితో సంబంధాలు చక్కదిద్దుకునేందుకు కశ్మీర్ వెళ్లిన సన్నీ.. అక్కడ తెలుగు అమ్మాయి కన్యను కలుసుకోవడంతో ప్రేమ, స్నేహం, నేరం కలిసి కథను మరింత గందరగోళంలోకి నెడతాయి. పోలీసు దంపతులు, కూతురి కోసం వెతికే తండ్రి, అపహరణలు, ఉగ్రవాదుల నేపథ్యం వంటి అనేక పాత్రలు కథలో చేరినా వాటిని ప్రధాన కథతో బలంగా ముడిపెట్టడంలో సినిమా తడబడింది. రాగ్ మయూర్ నటన శబ్దభరితంగా మారగా, మెరిన్ ఫిలిప్ పాత్రకు ఆసక్తికరమైన ఛాయ ఉన్నా తర్వాత పక్కకు తప్పుతుంది. కొన్ని సంభాషణలు, పాటలు, కశ్మీర్ అందాలు మాత్రం కాస్త ఊరటనిస్తాయి. 'అనుమానమే అన్ని కష్టాలకు మూలం' అనే భావన చుట్టూ సాగిన ఈ 111 నిమిషాల ప్రయాణం.. మంచి నటీనటుల బృందం ఉన్నా కథన గందరగోళాన్ని దాటలేకపోయింది.





# సింగనమల బొబ్బిలి.. రణబాలి రణగర్జన!

**అక్టోబర్ 16న థియేటర్లలో యుద్ధ జాతర**

సినిమా తెరపై మరోసారి రణగర్జన వినిపించబోతోంది. 'రణబాలి' పేరుతో వస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రం అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలకు సిద్ధమైంది. "సింగనమల బొబ్బిలి రణబలి" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటనతో అభిమానుల్లో ఒక్కసారిగా ఉత్సాహం రెట్టింపైంది. మాతృభూమి కోసం ప్రమాణం చేసిన ఓ యోధుడు.. తన నేల కోసం కత్తి పట్టిన వీరుడు.. తన ప్రజల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని పోరాట యోధుడి కథగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. మాతృభూమిపై ప్రమాణం.. ప్రజల కోసం పోరాటం.. శత్రువుపై రణగర్జన.. ఇవన్నీ కలగలిసిన కథతో తెరపై భారీ యుద్ధ వాతావరణాన్ని ఆవిష్కరించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అక్టోబర్ 16ను గుర్తుపెట్టుకోవాలంటూ అభిమానులకు పిలుపునిచ్చిన మేకర్స్.. త్వరలోనే థియేటర్లలో కలుద్దామంటూ ఉత్కంఠ పెంచారు. వీరత్వం, భావోద్వేగం, దేశభక్తి, పోరాట స్ఫూర్తితో సాగే ఈ సినిమా కోసం ప్రేక్షకుల్లో ఇప్పటికే ఆసక్తి మొదలైంది. అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెరపైకి రానున్న 'రణబాలి'.. థియేటర్లలో ఎలాంటి రణరంగాన్ని సృష్టించబోతోందో చూడాలి!





# ట్రెండింగ్‌లో కేసీఆర్

**ది ప్యారడైజ్ పొలిటికల్ హీట్**

ది ప్యారడైజ్ సినిమా చుట్టూ సాగుతున్న చర్చ ఇప్పుడు కథ, నటన, వసూళ్లను దాటి తెలంగాణ-ఆంధ్ర రాజకీయ భావోద్వేగాల వైపు మళ్లింది. సినిమాలో తెలంగాణ నేపథ్యానికి అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలిన పాత్ర కనిపించడం ప్రేక్షకుల మధ్య ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. తెలంగాణకు చెందిన కొందరు ప్రేక్షకులు సినిమా తెలంగాణ గుర్తింపును ప్రతిబింబిస్తోందని భావిస్తూ మద్దతు వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్‌ను పోలిన పాత్రను వీరుడిగా చూపించడం కొందరు ఆంధ్ర అనుకూల, టీడీపీ అనుకూల వర్గాలకు నచ్చకపోయి ఉండొచ్చనే చర్చ కూడా కొనసాగుతోంది. ఇదే సమయంలో 2021లో సినిమా టికెట్ ధరలపై నాని చేసిన వ్యాఖ్యలను గుర్తుచేసుకుంటున్న కొందరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల వైఖరిపైనా చర్చ జరుగుతోంది. తెలంగాణలోనూ కేసీఆర్ తరహా పాత్రను రక్షకుడిగా చూపించడం కాంగ్రెస్ మద్దతుదారుల్లో కొంత అసంతృప్తికి కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో 'ది ప్యారడైజ్' సినిమా ఇప్పుడు కేవలం వెండితెర కథగా కాకుండా తెలంగాణ భావోద్వేగం, ఆంధ్ర-తెలంగాణ చర్చలు, రాజకీయ అనుబంధాలు కలిసిన హాట్‌టాపిక్‌గా మారింది. ఈ చర్చలు రాబోయే రోజుల్లో కొనసాగుతాయా.. లేక సినిమా ప్రయాణంతో పాటు చల్లబడతాయా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఖుష్బూ వెయిట్ లాస్ సీక్రెట్

- బిర్యానీ తింటూనే 38 కిలోల తగ్గుదల
- స్వీట్లూ మానలేదు.. చాయ్ ఆపలేదు
- అయినా సరికొత్త ఫిట్‌నెస్ రూపం!

బిర్యానీ అంటే ఇష్టం.. స్వీట్లు అంటే ప్రాణం.. పాలతో చక్కెర వేసిన చాయ్ కూడా రోజూ ఉండాల్సిందే.. అయినా ఏకంగా 38 కిలోల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచారు నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్. దాదాపు 98 కిలోల బరువుకు చేరుకున్న సమయంలో తనలో మార్పు అవసరమని ఆమె గుర్తించారు. రజనీకాంత్‌తో కలిసి నటించిన ఓ సినిమాలో తనను తాను తెరపై చూసుకున్నప్పుడు తానే గుర్తుపట్టలేకపోవడం, మెట్లు ఎక్కేటప్పుడు మోకాళ్ల నొప్పి రావడం ఆమెకు కీలక మలుపుగా మారాయి. భర్త అప్పటికే నడక, యోగా చేస్తుండటం, పిల్లలు కూడా బరువు తగ్గడం ఆమెకు ప్రేరణ ఇచ్చాయి. అయితే కఠినమైన ఆహార నియమాలు పాటించకుండా మోతాదుపైనే దృష్టి పెట్టడం ఆమె ఫిట్‌నెస్ ప్రయాణానికి అసలు మంత్రంగా మారింది. ఇష్టమైన మటన్ బిర్యానీని పూర్తిగా వదలకుండా పెద్ద ప్లేట్ బదులు ఒక గిన్నె, ఒక్క మటన్ ముక్కకు పరిమితం చేసుకున్నారు. ఐస్‌క్రీమ్, భారతీయ స్వీట్లు కూడా పూర్తిగా దూరం చేయలేదు.. తక్కువ మోతాదులో ఆస్వాదించారు. పాలతో చక్కెర చాయ్ కూడా కొనసాగించారు. వ్యాయామశాలకు వెళ్లడం తనకు ఇష్టం లేదని చెప్పిన ఖుష్బూ.. నడక, యోగా వంటి వ్యాయామాలతో క్రమంగా శరీరంలో మార్పు తీసుకొచ్చారు. 38 కిలోల బరువు తగ్గడం ఒక విజయం అయితే.. ఆ మార్పును నిలబెట్టుకోవడమే అసలైన సవాల్ అని చెబుతున్న ఆమె.. తక్కువ మోతాదు, క్రమమైన కదలిక, నియంత్రణ, నిరంతర సాధనతోనే తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.